

TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 02 | సంచిక: 336 | హైదరాబాద్ | గురువారం | 14-05-2026 | పేజీలు: 08


## బండి కుమారుడిపై లుకౌట్ నోటీసులు ఇవ్వాలి

**కల్వకుంట్ల కవిత డిమాండ్**
**సీఎం రేవంత్ సర్కార్‌పై విమర్శలు**
**ఆరోపణలు నిజమైతే బండి రాజీనామా చేయాలని డిమాండ్**
**ప్రధాని వేదికపై బండి సంజయ్ ఉండటంపై విమర్శ**
**సోషల్ మీడియాలో బాధితురాలికి వేధింపులపై ఆగ్రహం**
**పోస్టులు పెట్టిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్**
**పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై సీఎం మౌనం వీడాలన్న కవిత**
**బీసీ రిజర్వేషన్ల కోసం దేశవ్యాప్త పోరాటానికి పిలుపు**



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**
తెలంగాణ రాజకీయాల్లో మరోసారి విమర్శల పర్వం మొదలైంది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బండి సంజయ్ కుమారుడిపై నమోదైన పోక్సో కేసు వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ, ఆయన దేశం విడిచి పారిపోకుండా పోలీసులు తక్షణమే లుకౌట్ నోటీసులు జారీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. లైంగిక వేధింపుల వంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి తండ్రిగా ఉంటూ, బండి సంజయ్ ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి బహిరంగ వేదికలను పంచుకోవడం సమాజానికి ఏం సందేశం ఇస్తుందని ఆమె ప్రశ్నించారు. ఈ కేసులో నేరం రుజువైతే నైతిక బాధ్యత వహిస్తూ బండి సంజయ్ తన కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని ఆమె స్పష్టం చేశారు. బాధితురాలి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా సోషల్ మీడియాలో అసభ్యకర వీడియోలు పోస్ట్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అటువంటి అకౌంట్లను వెంటనే బ్లాక్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.
మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై కూడా కవిత విమర్శనాస్త్రాలు సంధించారు. ముఖ్యంగా నీటి పారుదల ప్రాజెక్టుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిని ఆమె తప్పుబట్టారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించాలని

..మిగతా 2లో

## పార్కింగ్ సమస్యపై ఫోకస్ పెట్టండి

**ఉబర్ ప్రతినిధులకు సీఎం రేవంత్ సూచన**
**మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని ఆహ్వానం**
**హైదరాబాద్‌లో ఉబర్ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వ హామీ**
**భారత్ ఫ్యూచర్ సిటీలో కార్యాలయం ఏర్పాటు చేయాలన్న ఉబర్ ఆసక్తి**
**పార్కింగ్‌తో పాటు ఈవీ ఛార్జింగ్ సెంటర్లపై దృష్టి పెట్టాలని సీఎం సూచన**
**ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్ అభివృద్ధి లక్ష్యమన్న రేవంత్**
**అమెరికా వెలుపల తొలి ఉబర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హైదరాబాద్‌లోనే**
**600 మంది ఇంజినీర్లతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఉబర్**
**మెట్రో స్టేషన్ల వద్ద పార్కింగ్ కొరతపై సీఎం ఆందోళన**
**ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులకు భారీ కంపెనీల ఆసక్తి**
**సమగ్ర అధ్యయనం చేసి ప్రతిపాదనలు తీసుకొస్తామన్న ఉబర్ ప్రతినిధులు**
**తెలంగాణలో అర్బన్ మొబిలిటీకి కొత్త దిశగా ప్రభుత్వ ప్రయత్నాలు**



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**
ప్రధాన నగరాల్లో రోజురోజుకూ తీవ్రమవుతున్న పార్కింగ్ సమస్యపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. నగరాభివృద్ధి, ట్రాఫిక్ నిర్వహణ, అర్బన్ మొబిలిటీ అంశాలను సమగ్రంగా పరిగణనలోకి తీసుకుంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రముఖ రైడ్‌హైలింగ్ సంస్థ ఉబర్‌కు కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా హైదరాబాద్ వంటి వేగంగా విస్తరిస్తున్న మెట్రో నగరాల్లో భవిష్యత్తులో పార్కింగ్ సంక్షోభం మరింత పెరిగే అవకాశాలు ఉన్న నేపథ్యంలో మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటులో ప్రైవేట్ సంస్థలు కూడా భాగస్వామ్యం కావాలని సీఎం సూచించారు.
ఉబర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని ప్రతినిధి బృందం బుధవారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా తెలంగాణలో ఉబర్ సంస్థ కార్యకలాపాలు, హైదరాబాద్ కేంద్రంగా చేపడుతున్న విస్తరణ

..మిగతా 2లో



## హిందూ ధర్మం ఒక జీవన విధానం

సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు
దీపం వెలిగిస్తే చాలని స్పష్టీకరణ!
హిందూయిజంపై రాజ్యాంగ ధర్మాసనం కీలక విశ్లేషణ
మత విశ్వాసాన్ని నిరూపించుకోవడంపై కీలక వ్యాఖ్యలు
గుడికి వెళ్లాల్సిన అవసరం లేదని వెల్లడి
గుడి సెలో దీపం వెలిగించుకున్నా సరిపోతుందని వ్యాఖ్య
శబరిమల తీర్పు పునః సమీక్ష పిటిషన్లపై 15వ రోజు విచారణ
మతం పేరుతో మహిళలపై వివక్ష చూపకూడదన్న పిటిషన్లపై విచారణ

## సింగోటం గోపాలదిన్నె లింక్ కెనాల్ పనులు వేగవంతం చేయాలి..

**చివరి ఆయకట్టుకు సాగునీరు చేరేలా పనులు వేగవంతం చేయాలని మంత్రి ఆదేశాలు**
**భూములు కోల్పోయే రైతులకు మార్కెట్ ధర కంటే మూడింతల పరిహారం ప్రతిపాదన**
**భూ బాధిత రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన జూపల్లి కృష్ణారావు**
**రైతుల అభ్యంతరాలు తెలుసుకుని అధికారులకు స్పష్టమైన సూచనలు**
**సంగోటం–గోపాలదిన్నె లింక్ కెనాల్ పనులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి**
**సాగునీటి లక్ష్యంతో ప్రాజెక్టు పూర్తి దిశగా చర్యలు వేగం**
**బొల్లారం రైతు వేదికలో భూ బాధితులతో మంత్రివర్యుల చర్చలు**
**రైతులకు న్యాయం జరిగేలా పరిహారం ప్రక్రియ చేపట్టాలని అధికారులకు సూచన**
**ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల రైతుల సమస్యలపై మంత్రి సమీక్ష**
**ఆయకట్టు భూములకు నీరందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం**



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**
సింగోటంగోపాలదిన్నె లింక్ కెనాల్ పనులను త్వరితగతిన పూర్తి చేసి, చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు కింద భూములు కోల్పోతున్న రైతులకు ప్రస్తుత మార్కెట్ ధర కంటే మూడింతల పరిహారం అందేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం బొల్లారం గ్రామంలోని

..మిగతా 2లో

## ఆచరణలోకి ఇంధన పొదుపు

తన కాన్వాయ్‌ను సగానికి తగ్గించుకున్న ప్రధాని మోదీ
ప్రధాని బాటలోనే ప్రముఖ నేతలు
పశ్చిమాసియా యుద్ధ మేఘాల నేపథ్యంలో చర్యలు
దేశవ్యాప్తంగా ఇంధన పొదుపుకు ప్రధాని పిలుపు
ప్రధాని అధికారిక కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్య సగం తగ్గింపు
ప్రధాని బాటలోనే అమిత్ షా, మధ్యప్రదేశ్, ఢిల్లీ సీఎం పొదుపు చర్యలు
భద్రతలో రాజీ పడకుండానే
ఎలక్ట్రిక్ వాహనాల వినియోగానికి ఎస్పీజీ ప్రాధాన్యత
విదేశీ మారకద్రవ్య పొదుపు కోసం బంగారం కొనొద్దని ప్రజలకు సూచన



**నేషనల్‌బ్యూరో, (ప్రజాక్షేత్రం):**
ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం అంతర్జాతీయంగా ఇంధన ధరలపై పెను ప్రభావాన్ని చూపుతోంది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో దేశ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకోవడానికి ఇంధన పొదుపు ఒక్కటే మార్గమని భావించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, స్వయంగా ఆచరణలో పెట్టి దేశానికి ఆదర్శంగా నిలిచారు. తన పర్యటనల సమయంలో వినియోగించే భారీ అధికారిక కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను ఏకంగా 50 శాతం మేర తగ్గించాలని

..మిగతా 2లో

## ధాన్యం రైతు దిగాలు.. కొనుగోళ్లలో అన్నీ సమస్యలే!

**ధాన్యం కొనుగోళ్లలో రైతులకు తప్పని ఇబ్బందులు**
**గన్నీ బ్యాగులు, వాహనాల కొరతతో కొనుగోళ్లు ఆలస్యం**
**కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి రైతుల నిరీక్షణ**
**కొద్ది మంది కాంట్రాక్టర్లకే టెండర్లు.. ధాన్యం తరలింపులో జాప్యం**
**పీక్ సీజన్‌లో సరిపడా వాహనాలు లేక రైతుల ఆందోళన**
**మిల్లర్ల చేతివాటం.. తాలు, మట్టి పేరుతో తరుగు ఆరోపణలు**
**మద్దతు ధరకు ధాన్యం అమ్మకాలు కొనసాగుతున్నా సమస్యలు యథాతథం**
**ఉమ్మడి జిల్లాలో వందలాది కొనుగోలు కేంద్రాల ఏర్పాటు**
**ఏ గ్రేడ్‌కు రూ.2389, కామన్ గ్రేడ్‌కు రూ.2369 మద్దతు ధర**
**వరి సాగు అధికంగా ఉన్న మండలాల్లో ప్రత్యేక కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు**




**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**
ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు తగ్గడం లేదు. గన్నీ బ్యాగులు, వాహనాల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే నిరీక్షిస్తున్నారు. వాహనాల టెండర్ కొద్ది మంది కాంట్రాక్టర్లకే రెగ్యులర్‌గా ఇస్తుండడంతో పీక్ సీజన్ లో కావాల్సినన్ని

..మిగతా 3లో

## ఇసుక దందాపై కొరడా..

**జిల్లాలో అక్రమ ఇసుక దందాపై కలెక్టర్, సీపీ స్పెషల్ ఫోకస్**
**"మన ఇసుక" యాప్‌ను అడ్డంగా వాడేస్తున్న ఇసుక మాఫియా**
**ఇందిరమ్మ ఇళ్ల పేరుతో సాగుతున్న ఇసుక అక్రమ రవాణా**
**రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యంతో ఆగని ఇసుక మాఫియా దందా**
**ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న అక్రమ ఇసుక రవాణా**
**ఇసుక, మొరం, నల్లమట్టి అక్రమ రవాణాపై అధికారుల సీరియస్ యాక్షన్**
**ఇసుక మాఫియాపై మెరుపు దాడులు.. పదుల సంఖ్యలో వాహనాల సీజ్**
**తహసీల్దార్లకు ఆదేశాలు ఇచ్చినా ఫలితం లేకపోవడంపై ఆందోళన**
**అక్రమ రవాణాదారుల వెన్నులో వణుకు పుట్టిస్తున్న పోలీసుల చర్యలు**
**ఇసుక రీచ్‌ల నుంచి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపిన అధికారులు**



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**
జిల్లాలో అడ్డగోలుగా జరుగుతున్న అక్రమ ఇసుక, మొరం అక్రమ రవాణా దందాపై జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, సీపీ సాయిచైతన్యలు స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి ప్రభుత్వ ఖజానాకు గండి పడకుండా అమల్లోకి తెచ్చిన మన ఇసుక యాప్ ను కూడా ఇసుక మాఫియా అధికారుల(ఇంటి దొంగలు) సహకారంతో అడ్డగోలుగా వాడేసుకుంటున్నారు. ఇసుక యాప్ ను,

..మిగతా 2లో

## బండి కుమారుడిపై లుకౌట్ నోటీసులు ఇవ్వాలి

మొదటిపేజీ తరువాయి

కోరుతూ కేంద్రానికి లేఖ రాయడంలో ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తోందని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఈ కీలక ప్రాజెక్టును ఒక్కసారి కూడా సందర్శించకపోవడం గమనార్హమని, ప్రాజెక్టుల పట్ల ఆయనకు ఉన్న చిత్తశుద్ధి ఇదేనా అని ప్రశ్నించారు. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్టు నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నారని, కానీ తెలంగాణ ప్రభుత్వం మన రాష్ట్ర నీటి హక్కులను కాపాడటంలో పూర్తిగా విఫలమవుతోందని ఆమె ఆరోపించారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో నీటి వనరుల సద్వినియోగం కోసం ఒక ప్రత్యేక 'వాటర్ కమిషన్' ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా కవిత హామీ ఇచ్చారు.

కులగణన మరియు రిజర్వేషన్ల అంశంపై కూడా కవిత తన గళాన్ని వినిపించారు. రాష్ట్రంలో జరగబోయే కులగణనలో ఓబీసీ కాలమ్ తప్పనిసరిగా ఉండాలని, దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. వెనుకబడిన వర్గాలకు (బీసీలు) జనాభా దామాషా ప్రకారం 50 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు తాము విశ్రమించబోమని, దీని కోసం దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ప్రకటించారు. జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కూడా ఆమె స్పందించారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఇటువంటి పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని మండిపడ్డారు. పేపర్ లీక్ ఘటనలను కేంద్రం సీరియస్‌గా తీసుకోవాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో



ప్రస్తుతం ఉన్న రాజకీయ శూన్యతను భర్తీ చేయడానికి, ప్రజల గొంతుకగా నిలవడానికే తమ పార్టీ పుట్టిందని కవిత ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాల మధ్య సాగుతున్న ఈ మాటల యుద్ధం ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు కుటుంబ సభ్యులపై వస్తున్న ఆరోపణలు కేంద్ర మంత్రికి ఇబ్బందికరంగా మారుతుండగా, మరోవైపు ప్రాజెక్టులు మరియు రిజర్వేషన్ల అంశాలపై కవిత చేస్తున్న వ్యాఖ్యలు ప్రభుత్వానికి సవాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా మహిళల భద్రత మరియు సామాజిక న్యాయంపై ఆమె సంధిస్తున్న ప్రశ్నలకు అటు పోలీసులు, ఇటు ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తాయో వేచి చూడాలి. నీట్ పరీక్షల లీకేజీపై విద్యార్థుల నుంచి వస్తున్న ఆగ్రహాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవడానికి ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్న వేళ, కవిత చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో వేడిని పెంచాయి. మొత్తానికి బండి సంజయ్ కుమారుడి కేసు నుండి ప్రాజెక్టుల వరకు ప్రతి అంశాన్ని ప్రస్తావిస్తూ కవిత చేస్తున్న ఈ పోరాటం తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి మలుపులు తిప్పుతుందో చూడాలి.

# పార్కింగ్ సమస్యపై ఫోకస్ పెట్టండి

మొదటిపేజీ తరువాయి

ప్రణాళికలు, భవిష్యత్ పెట్టుబడులపై ప్రతినిధులు సీఎంకు వివరించారు. రాష్ట్రంలో సాంకేతిక రంగానికి ఉన్న అవకాశాలు, మౌలిక సదుపాయాల విస్తరణ, ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి అనుకూల విధానాలను కూడా చర్చించారు. సమావేశంలో మాట్లాడిన దారా ఖోస్రోషాహి హైదరాబాద్‌లో ఇప్పటికే కొనసాగుతున్న ఉబర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను మరింత విస్తరించనున్నట్లు వెల్లడించారు. అమెరికా వెలుపల ఉబర్ ఏర్పాటు చేసిన తొలి సెంటర్ ఇదేనని, ప్రస్తుతం ఇక్కడ సుమారు 600 మంది ఇంజినీర్లు పని చేస్తున్నారని తెలిపారు. సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, డేటా సైన్స్, మ్యాపింగ్, మొబిలిటీ సొల్యూషన్స్ వంటి కీలక రంగాల్లో హైదరాబాద్ కేంద్రంగా ఉబర్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని చెప్పారు.

భారత్ ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పొరేట్ కార్యాలయం నిర్మించేందుకు సంస్థ ఆసక్తి చూపుతున్నట్లు కూడా ఖోస్రోషాహి వెల్లడించారు. భవిష్యత్తులో తెలంగాణలో కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం పరిశ్రమలకు అందిస్తున్న మద్దతు, పారదర్శక విధానాలు, వేగవంతమైన అనుమతుల వ్యవస్థ తమను ఆకర్షించాయని ఉబర్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నగరాల్లో వేగంగా పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను ప్రస్తావించారు. ముఖ్యంగా పార్కింగ్ సమస్య ప్రధాన సవాల్‌గా మారుతోందని తెలిపారు. రహదారులపై వాహనాల సంఖ్య పెరుగుతున్నప్పటికీ పార్కింగ్ సదుపాయాలు తగిన స్థాయిలో అభివృద్ధి చెందకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. భవిష్యత్తులో ఈ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.

అందుకే మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటు అత్యవసరమని పేర్కొన్న సీఎం, ఈ రంగంలో ఉబర్ వంటి అంతర్జాతీయ సంస్థలు ముందుకు రావాలని సూచించారు. నగరాల్లో స్మార్ట్ మొబిలిటీ వ్యవస్థల అభివృద్ధికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. పార్కింగ్ సెంటర్లను కేవలం వాహన నిల్వ కేంద్రాలుగానే కాకుండా ఆధునిక సౌకర్యాలతో కూడిన అర్బన్ మొబిలిటీ హబ్‌లుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేకంగా మెట్రో స్టేషన్ల పరిసరాల్లో పార్కింగ్ కొరత తీవ్ర సమస్యగా మారిందని సీఎం వివరించారు. మెట్రోను ఉపయోగించేందుకు వచ్చే ప్రయాణికులు తమ వాహనాలను నిలిపేందుకు సరైన స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పార్కింగ్ సెంటర్లతో పాటు ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను కూడా ఏర్పాటు చేస్తే భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఉంటుందని సూచించారు.

ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్న తరుణంలో తెలంగాణ కూడా ఈ రంగంలో ముందంజలో నిలవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీఎం తెలిపారు. ఈవీ ఎకోసిస్టమ్ అభివృద్ధికి మౌలిక సదుపాయాల కల్పన అత్యంత కీలకమని చెప్పారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో పార్కింగ్ మరియు ఛార్జింగ్ సదుపాయాలను విస్తరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉంటుందని వెల్లడించారు. ముఖ్యమంత్రి సూచనలపై సమగ్ర అధ్యయనం చేసి తగిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని ఉబర్ ప్రతినిధి బృందం హామీ ఇచ్చింది. ప్రపంచంలోని పలు నగరాల్లో అమలు చేస్తున్న ఆధునిక అర్బన్ మొబిలిటీ నమూనాలను తెలంగాణకు అనుకూలంగా పరిశీలిస్తామని తెలిపింది. హైదరాబాద్ వంటి మెట్రో నగరాలకు భవిష్యత్ దృష్టితో కూడిన పరిష్కారాలు అవసరమని అభిప్రాయపడింది.



సమావేశంలో హైదరాబాద్ సమీపంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును కూడా సీఎం రేవంత్ రెడ్డి ఉబర్ ప్రతినిధులకు వివరించారు. సుమారు 30 వేల ఎకరాల్లో ఈ ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఇది సాధారణ పారిశ్రామిక నగరం కాదని, భవిష్యత్ టెక్నాలజీలు, స్మార్ట్ మౌలిక సదుపాయాలు, గ్రీన్ అర్బన్ ప్లానింగ్‌కు కేంద్రంగా నిలుస్తుందని వివరించారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 500 కంపెనీలను ఫ్యూచర్ సిటీలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు ఆహ్వానిస్తున్నామని సీఎం వెల్లడించారు. ఇప్పటికే అనేక అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులపై ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు. గత డిసెంబర్‌లో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో వందకు పైగా కంపెనీలు పాల్గొని పెట్టుబడులకు ముందుకు వచ్చాయని గుర్తుచేశారు.

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి కేవలం 25 కిలోమీటర్ల దూరంలోనే ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం తెలిపారు. అంతర్జాతీయ కనెక్టివిటీ, ఆధునిక రవాణా వ్యవస్థలు, స్మార్ట్ సిటీ మౌలిక సదుపాయాలతో ఇది ప్రపంచ పెట్టుబడిదారులను ఆకర్షించే కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పొరేట్ కార్యాలయం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని సీఎం హామీ ఇచ్చారు. తెలంగాణను ప్రపంచ స్థాయి టెక్నాలజీ మరియు మొబిలిటీ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఉబర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఉబర్ ఇండియా & సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అర్బన్ మొబిలిటీ సంస్కరణలు, ఫ్యూచర్ సిటీ ప్రణాళికలు, అంతర్జాతీయ సంస్థల పెట్టుబడులపై చూపుతున్న చొరవ నేపథ్యంలో హైదరాబాద్ గ్లోబల్ టెక్నాలజీ మరియు స్మార్ట్ అర్బన్ మౌలిక సదుపాయాల కేంద్రంగా మరింత వేగంగా ఎదిగే అవకాశాలు కనిపిస్తున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### సింగోటం గోపాలదిన్నె లింక్ కెనాల్
## పనులు వేగవంతం చేయాలి..

మొదటిపేజీ తరువాయి

రైతు వేదిక వద్ద సంగినేనిపల్లి, తూముకుంట, బొల్లారం గ్రామాలకు చెందిన భూ బాధిత రైతులతో మంత్రి ప్రత్యేకంగా సమావేశమై, వారి అభ్యంతరాలను అడిగి తెలుసుకున్నారు.

**ఎకరాకు రూ.11.50 లక్షల పరిహారం..**

ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ మార్కెట్ విలువ రూ.1,87,500 తక్కువగా ఉందంటూ రైతులు వ్యక్తం చేసిన అభ్యంతరాలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. బేసిక్ మార్కెట్ విలువను తక్షణమే రెండింతలు పెంచి రూ.3,75,000గా ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పెంచిన విలువ (రూ.3,75,000) ఆధారంగా భూసేకరణ చట్టం ప్రకారం మూడింతల పరిహారంతో పాటు, గెజిట్ ప్రచురించిన నాటి నుంచి వడ్డీని కూడా కలిపి ఎకరాకు మొత్తం రూ.11,50,000 చొప్పున చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి తీసుకున్న ఈ నిర్ణయం పై రైతులు హర్షం వ్యక్తం చేశారు. తక్షణమే అవార్డు కాపీలు మంజూరు చేసి పరిహార పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆర్డీవో సుబ్రహ్మణ్యాన్ని మంత్రి ఆదేశించారు.

**అసైన్డ్, పట్టా లేని రైతులకు సమన్యాయం..**

సాధారణ పట్టాదారులతో పాటే అసైన్డ్ పట్టాలు కలిగిన రైతులకు కూడా ఇదే తరహా పరిహారాన్ని వర్తింపజేయాలని బొల్లారం గ్రామస్థులు మంత్రి దృష్టికి తీసుకురాగా, దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ.. అసైన్డ్ పట్టా దారులకు సమాన పరిహారం అందించడంతో పాటు, ఎలాంటి పట్టాలు లేకుండా చాలా కాలంగా ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న పేద రైతులకు కూడా భూసేకరణ చట్టంలోని ట్రిపుల్ ఆర్ ('3ఆర్) ప్రకారం పూర్తి పరిహారం చెల్లించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**40 వేల ఎకరాలకు సాగునీరు**

కొల్లాపూర్ నియోజకవర్గంలోని వీపనగండ్ల, చిన్నంబావి మండలాల్లో జూరాల ప్రాజెక్టు పరిధిలో 25 వేల ఎకరాలు, భీమా ప్రాజెక్టు కింద 15 వేల ఎకరాలు.. మొత్తం 40 వేల ఎకరాల చివరి ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదని మంత్రి జూపల్లి వివరించారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికే 2018లో సింగోటంగోపాలదిన్నె లింక్ కెనాల్‌కు పరిపాలనా అనుమతులు మంజూరు చేయించినట్లు గుర్తుచేశారు. ఈ కెనాల్ నిర్మాణం కోసం మొత్తం 305.23 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందన్నారు.

## సాలూర చెక్‌పోస్టు వద్ద కట్టెల వాహనాల పట్టివేత

- **మహారాష్ట్ర నుంచి తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు**
- **రెండు డీసీఎంలు, ఒక ట్రాక్టరు స్వాధీనం**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 13(ప్రజాక్షేత్రం) :** మహారాష్ట్ర నుంచి తెలంగాణలోకి అక్రమంగా తరలిస్తున్న కట్టెలను బుధవారం సాయంత్రం సాలూర అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఏసీపీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు సరిహద్దుల్లో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా.. ఎటువంటి అనుమతులు లేకుండా కట్టెలు లోడ్ చేసిన రెండు డీసీఎం వాహనాలు, ఒక ట్రాక్టరు పట్టుబడ్డాయి. పోలీసులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా, వారు ఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కట్టెలను ఎక్కడి నుంచి తరలిస్తున్నారు? దీనికి బాధ్యులు ఎవరనే కోణంలో అధికారులు విచారణ జరుపుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ తనిఖీ లో ఎ ఎస్సై ప్రశాంత్ రెడ్డి, సిబ్బంది దినేష్, మనోజ్, గంగాధర్, అమరేందర్ ఉన్నారు.



# ఇసుక దందాపై కొరడా..

మొదటిపేజీ తరువాయి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను అడ్డంపెట్టుకుని వాటి పేరు పై అక్రమ దందాకు తెరలేపారు. తహసీల్దార్లకు ఎన్ని ఆదేశాలిచ్చినా, ఎంత గట్టిగా చెప్పినా ఇసుక మాఫియాతో రెవెన్యూ యంత్రాంగానికి ఉన్న కరెన్సీ బంధం కారణంగా ఇసుక అక్రమ రవాణాకు ఆశించిన విధంగా అడ్డుకట్ట పడటం లేదు. ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు చిల్లు పెట్టే విధంగా అడ్డూ అదుపు లేకుండా కొనసాగుతున్న ఇసుక, మొరం, నల్లమట్టి అక్రమ రవాణా దందా యథేచ్ఛగా నడుస్తోంది. అయితే ఇసుక మాఫియా వెన్ను విరిచేలా కలెక్టర్ సీరియస్ యాక్షన్‌లోకి దిగారు. పోలీస్ కమిషనర్ పోతరాజు సాయి చైతన్య సైతం ఇసుక రీచ్ ల నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాల పై మెరుపు దాడులు నిర్వహించి పదుల సంఖ్యలో వాహనాలను సీజ్ చేస్తూ అక్రమ దందా చేసే వ్యాపారుల వెన్నులో వణుకు పుట్టిస్తున్నారు.


**నిఘా ఎంతున్నా.. నిబంధనలు కఠినతరం చేసినా..**

జిల్లాలో ప్రతి రోజు దాదాపు సగటున రూ. 30 కోట్ల వరకు ఇసుక, మొరం దందా జరుగుతోందని అనధికారిక అంచనా. ఈ లెక్కన ప్రతి నెలా రూ. 1000 కోట్ల వరకు ఇసుక దందా కొనసాగుతోందని తెలుస్తోంది. ఇసుక మాఫియాకు రూ. వేల కోట్ల లాభం చేకూరుతున్నప్పటికీ ప్రభుత్వానికి పిసరంత ఆదాయం కూడా రావడం లేదని ఉన్నతాధికారులకు కూడా తెలిసిన విషయమే. మండల స్థాయిలో రెవెన్యూ అధికారులు, గ్రామ పాలనాధికారులే ఈ అక్రమ దందాకు సెక్యూరిటీ గార్డులుగా ఉన్నారనే విమర్శలున్నాయి. వీరి కనుసన్నల్లోనే అంతా జరుగుతోందని, వీరికి క్రమం తప్పకుండా చెల్లించాల్సిన ముడుపులు చెల్లిస్తుండటంతో నిబంధనలకు నీళ్లొదిలేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

బాల్కొండ నియోజకవర్గంలోని మోర్తాడ్, ఏర్గట్ల, రామన్నపేట్, గాండ్లపేట్, భీమ్ గల్, బడా భీమ్ గల్, బెజ్జోర, గోనుగొప్పుల్, ముచ్కూర్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని చింతలూర్, కలిగోట్, కొలిప్యాక, తొర్లికొండ, ఇందల్ వాయి, డిచ్ పల్లి తదితర ప్రాంతాల్లోని వాగుల నుండి రాత్రి పగలనే తేడా లేకుండా ఇసుక రవాణా జరుగుతోందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. నందిపేట్, మాక్లూర్, బాన్సువాడ, డిచ్ పల్లి, భీమ్ గల్, ఆర్మూర్, పెర్కిట్ తదితర ప్రాంతాల నుండి అక్రమంగా మొరం కూడా జోరుగా సాగుతోంది. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, పైగా ఫిర్యాదు చేసిన వారి వివరాలను ఇసుక మాఫియాకు చేరవేసి బెదిరింపులకు గురి చేస్తున్నారని పలువురు వాపోయారు.

**రూ. కోట్లలో దందా.. అడ్డుకునే వారే అండ..**

జిల్లా వ్యాప్తంగా ఇసుక రవాణా రూ. కోట్లలో జరుగుతోందని, ప్రతిరోజు ఈ దందా



సుమారు రూ. 30 కోట్ల నుంచి రూ. 50 కోట్ల వరకు ఉంటుందని తెలుస్తోంది. పైకి అంతలా కనిపించకపోయినా, లోపల రహస్యంగా జరిగే ఇసుక దందా కోట్లలోనే ఉందని ఇసుక మాఫియాలోని పలువురు గర్వంగా చెప్పుకుంటున్నారు. కింది స్థాయి, మండల స్థాయి అధికారులు, పోలీసులు, మీడియా అండగా ఉండగా పై స్థాయిలో ఉన్న అధికారులు తమనేం చేయలేరనే ధీమాను ఇసుక మాఫియా బహిరంగంగానే వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

**రెండు రోజులుగా చీతా ఫోర్స్ దాడులు..**

ఇసుక, మొరం రవాణాను అడ్డుకునేందుకు స్పెషల్ ఫోకస్ పెట్టిన అధికారులు సీపీ సాయిచైతన్య ఆదేశాలతో రెండు రోజులుగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వాహనాలపై దాడులను ముమ్మ రం చేశారు. ఆదివారం ధర్పల్లి మండలం లో మొరం రవాణా చేస్తున్న 13 ట్రాక్టర్లను, జేసీబీలను సీజ్ చేశారు. సోమవారం ఆర్మూర్, మోర్తాడ్ లో అక్రమ ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేశారు. 14 టైర్ల భారీ వాహనాల్లో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు, రవాణా పత్రాలు , మైనింగ్ సంబంధిత డాక్యుమెంట్లు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సీసీఎస్ పోలీసులు గుర్తించారు. దీంతో వెంటనే వాహనాలను స్వాధీనం చేసుకుని, డ్రైవర్లు మరియు సంబంధిత వ్యక్తుల వివరాలను నమోదు చేశారు. పట్టుబడిన లారీలను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం సంబంధిత మోర్తాడ్ మరియు ఆర్మూర్ పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ లకు అప్పగించారు.

పోలీసుల వరుస దాడులతో బెంబేలెత్తిపోతున్న ఇసుక, మొరం మాఫియా స్థానిక అధికారుల వద్దకు పరుగులు తీసి ఇలాగైతే మా దందా సంగతేంది సార్ అంటూ మొరపెట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో జరుగుతున్న రైడింగ్స్ తో జాగ్రత్తగా ఉండాలని, కొద్ది రోజులు ఇసుక, మొరం దందాలు ఆపాలని ఉచిత సలహాలిస్తున్నట్లు సమాచారం. ప్రతినెలా లక్షల్లో మీరు ముడుపులు తీసుకుంటూ పై అధికారులతో రైడింగ్స్ చేయిస్తున్నారా అంటూ ఇసుక మాఫియా లీడర్ ఒకరు బాల్కొండ నియోజకవర్గంలోని ఓ తహసీల్దార్ పై చిందులేసినట్లు తెలిసింది. ఇసుక, మొరం అక్రమ రవాణాతో పాటు గోదావరి నదీ పరివాహక ప్రాంత గ్రామాల నుండి జోరుగా సాగుతున్న నల్లమట్టి అక్రమ రవాణాపై కూడా కలెక్టర్ నజర్ పెట్టాలని, ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లలో జరిగే నష్టాన్ని నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

# ఆచరణలోకి 'ఇంధన పొదుపు'

మొదటిపేజీ తరువాయి

ఆయన అధికారులను ఆదేశించారు. దేశ ప్రజలకు పొదుపు పాఠాలు చెప్పడమే కాకుండా, తానే ముందుండి ఆ మార్పును ప్రారంభించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రధాని భద్రతను పర్యవేక్షించే స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్‌పీజీ) ఇప్పటికే ఈ మార్పులపై కసరత్తు పూర్తి చేసింది. భద్రతా పరమైన ప్రోటోకాల్స్‌లో ఎక్కడా రాజీ పడకుండానే, వాహనాల సంఖ్యను తగ్గించి, అందుబాటులో ఉన్న ఎలక్ట్రిక్ వాహనాలను ఎక్కువగా వినియోగించాలని ప్రధాని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కొత్త వాహనాల కొనుగోలుకు స్వస్తి పలికి, వనరులను పొదుపుగా వాడుకోవడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం.

ప్రధాని మోదీ తీసుకున్న ఈ సంచలన నిర్ణయం కేంద్ర మంత్రుల్లో, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రుల్లో కొత్త స్ఫూర్తిని నింపింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పటికే తన కాన్వాయ్‌ను సగానికి పైగా తగ్గించుకోగా, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తన కాన్వాయ్‌లోని వాహనాలను 13 నుంచి 8కి పరిమితం చేశారు. అటు ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా కూడా ప్రభుత్వ యంత్రాంగంలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టారు. ప్రజా నిధులు విలాసాల కోసం కాదని, అవి ప్రజల అభివృద్ధి కోసం మాత్రమేనని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వ అధికారులు ఒకే సమావేశానికి వెళ్లేటప్పుడు వేర్వేరు వాహనాలు కాకుండా కార్‌పూలింగ్ పద్ధతిని అనుసరించాలని, వీలైనంత వరకు ఢిల్లీ మెట్రో లేదా ఇతర ప్రజా రవాణా వ్యవస్థలను ఉపయోగించాలని ఆమె ఆదేశించారు. ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వ ఖజానాపై భారం తగ్గడమే కాకుండా, రోడ్లపై వాహనాల రద్దీ తగ్గి కర్బన ఉద్గారాలు నియంత్రణలోకి వస్తాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వీఐపీల రాకపోకల వల్ల గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌లలో ఇరుక్కుపోయే సామాన్య ప్రజలకు కూడా ఈ నిర్ణయంతో పెద్ద ఉపశమనం లభించనుంది.

కేవలం ఇంధనం మాత్రమే కాకుండా, విదేశాల నుంచి మనం దిగుమతి చేసుకునే ప్రతి వస్తువుపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని ప్రధాని మోదీ దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా వంటనూనె, బంగారం, రసాయన ఎరువుల దిగుమతుల కోసం దేశం భారీగా విదేశీ మారకద్రవ్యాన్ని ఖర్చు చేయాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కుటుంబం తమ వంటనూనె వినియోగాన్ని స్వల్పంగా తగ్గించినా అది దేశ ఆర్థిక వ్యవస్థకు గొప్ప ఊతమిస్తుందని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఏడాది పాటు బంగారం కొనుగోళ్లు నిలిపివేయాలని కోరడం ద్వారా దేశ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. రైతులు కూడా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, ఖర్చు తక్కువతో కూడిన సహజ వ్యవసాయం వైపు మళ్లాలని సూచించారు. దేశభక్తి అంటే కేవలం సరిహద్దుల్లో పోరాడటమే కాదని, బాధ్యతాయుతమైన పౌరులుగా దేశ వనరులను కాపాడుకోవడమే నిజమైన దేశభక్తి అని మోదీ వ్యాఖ్యానించారు. ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములైతేనే భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రధాని మోదీ అనుసరిస్తున్న ఈ పొదుపు మంత్రం కేవలం ప్రభుత్వానికే పరిమితం కాకుండా ఒక సామాజిక ఉద్యమంగా మారుతోంది. ప్రభుత్వ శాఖల్లోని వాహనాల వినియోగాన్ని తక్షణమే సమీక్షించాలని ఇప్పటికే ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు అధికారులను ఆదేశించారు. విదేశీ ఎగుమతులు, దిగుమతులపై ప్రపంచ వ్యాప్తంగా అంతరాయాలు కలుగుతున్న వేళ, స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంగా అడుగులు వేయాలని కేంద్రం భావిస్తోంది. రోడ్లపై ప్రభుత్వ వాహనాల సంఖ్య తగ్గడం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు, ప్రజల ప్రయాణాలు సులభతరం కావడం మరో సానుకూల అంశం. 'తగ్గించుకుందాం దేశాన్ని కాపాడుకుందాం' అనే నినాదంతో సాగుతున్న ఈ ప్రయాణం సామాన్య ప్రజలను కూడా పొదుపు దిశగా ఆలోచింపజేస్తోంది. ప్రధాని నుంచి సామాన్య పౌరుడి వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తే, అంతర్జాతీయ ఒత్తిళ్ల నుంచి దేశ ఆర్థిక వ్యవస్థను సులభంగా గట్టెక్కించవచ్చని ఈ చర్యలు నిరూపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో మరిన్ని రాష్ట్రాలు ఇదే బాటలో నడిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# ధాన్యం రైతు దిగాలు.. కొనుగోళ్లలో అన్నీ సమస్యలే!

మొదటిపేజీ తరువాయి

వాహనాలు సమకూర్చకపోవడంతో ధాన్యం తరలింపు ఆలస్యమవుతుంది. ధాన్యం కొనుగోలు మొదలు పెట్టినా మిల్లర్లు మాత్రం ఈ సీజన్ లో కూడా చేతివాటం ప్రదర్శిస్తున్నారు. తాలు, మట్టి పేరిట తరుగు తీస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ధాన్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి.


నెల రోజుల నుంచి వరి కోతలు మొదలు కావడంతో రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు అమ్మకాలు చేస్తున్నారు. కొనుగోలు కోసం ఉమ్మడి జిల్లా పరిధిలో వందలాది కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రాథమిక వ్యవసాయ, సహకార సంఘాలు, ఐకేపీ, ఇతర సొసైటీల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో మద్దతు ధరకు ఏ గ్రేడ్ రూ.2389, కామన్ గ్రేడ్ రూ.2369 కొనుగోలు చేస్తున్నారు. వరి ఎక్కువ సాగు చేసిన మండలాల పరిధిలో కేంద్రాలను ఎక్కువగా ఏర్పాటు చేశారు.

**వేధిస్తున్న సమస్యలు..**

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు తప్పడం లేదు. గన్నీ బ్యాగుల కొరత ఎక్కువగా ఉంది. పౌరసరఫరాల శాఖ ద్వారా భారీగానే గన్నీ బ్యాగులు సరఫరా చేస్తున్నా కొన్నిచోట్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గడిచిన 15 రోజులుగా ఉమ్మడి జిల్లా పరిధిలో ధాన్యం కొనుగోళ్లు పెంచారు. ఉమ్మడి జిల్లాలో ముఖ్యంగా హన్మకొండ, వరంగల్, ములుగు, భూపాలపల్లి జిల్లాలో వరి సాగు ఎక్కువగా ఉంది. జనగామ, మహబూబాబాద్ జిల్లాలోనూ ఈ యాసంగిలో భారీగానే సాగు చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ధాన్యం తరలింపు కోసం ముందే వాహనాలకు టెండర్లు పిలిచారు. కొనుగోలు మొదలు పెట్టగానే తరలింపునకు చర్యలు చేపట్టారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు అవసరమైన వాహనాలు సమకూర్చకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం కొన్న తర్వాత నాలుగైదు రోజుల వరకు వేచి ఉంటే తప్ప వాహనాలు దొరకడం లేదు. వచ్చిన వాహనాల ద్వారా మిల్లులకు పంపించిన అక్కడ కూడా లైన్ ఉండటం, హమాలీల కొరతతో మరింత ఆలస్యమవుతుంది. టెండర్లు వేసే సమయంలోనే వాహనాలు పెద్ద మొత్తంలో సమకూర్చాలని అధికారులు ట్రాన్స్ పోర్టు కాంట్రాక్టర్లకు సూచనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధుల అండదండలు ఉండడం అధికారులు సహకరించడంతో రైతులు మాత్రం ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సీజన్ లో ఇదే జరిగిన కాంట్రాక్టర్లను మాత్రం మార్చడం లేదు. ధాన్యం తరలింపుకు ఒక్కో కాంట్రాక్టర్ కు సీజన్ లో కోట్ల రూపాయలు చెల్లిస్తున్నారు. కిలో మీటర్ లెక్కన భారీగానే చెల్లింపులు చేస్తున్నారు. దూరం ఎక్కువగా ఉంటే అదనంగా డబ్బులు చెల్లిస్తున్నారు. ఇన్ని చేసినా రైతులకు మాత్రం సమస్యలు తప్పడం లేదు.

**మిల్లర్ల చేతివాటం..**

ఉమ్మడి జిల్లా పరిధిలో ధాన్యం కొనుగోలు మొదలైనా మిల్లర్ల చేతివాటం మాత్రం తగ్గలేదు. ఇప్పటికీ తాలు, మట్టి, ఇతర సమస్యలు చెప్పి తరుగు ఎక్కువగా తీస్తున్నారు. ఎండా కాలంలో తేమ తక్కువగా ఉన్నా కారణాలు చెబుతూ కోత విధిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో నమోదైన ట్రక్ షీట్ వివరాలకు మిల్లులకు వచ్చిన తర్వాత భారీ తేడా వస్తుంది. క్వింటాలుకు రెండు నుంచి మూడు కిలోలు తగ్గించడంతో నష్టపోతున్నారు. ప్రతీ సీజన్ లో వేల రూపాయలు రైతులు నష్టపోతున్నారు. ఎవరైనా రైతులు వారికి అభ్యంతరం చెబితే రోజుల తరబడి మిల్లుల్లోనే ఉంచుతున్నారు. ప్రభుత్వం రైతులకు తరుగు లేకుండా కొనుగోలు చేస్తామని చెప్పినా ఎక్కడ కూడా చర్యలు తీసుకోవడం లేదు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కొనుగోలు చేస్తున్నామని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.



# హిందూ ధర్మం ఒక జీవన విధానం

- **సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు**
- **దీపం వెలిగిస్తే చాలని స్పష్టీకరణ!**
- **హిందూయిజంపై రాజ్యాంగ ధర్మాసనం కీలక విశ్లేషణ**
- **మత విశ్వాసాన్ని నిరూపించుకోవడంపై కీలక వ్యాఖ్యలు**
- **గుడికి వెళ్లాల్సిన అవసరం లేదని వెల్లడి**
- **గుడిసెలో దీపం వెలిగించుకున్నా సరిపోతుందని వ్యాఖ్య**
- **శబరిమల తీర్పు పునః సమీక్ష పిటిషన్లపై 15వ రోజు విచారణ**
- **హిందూ మతంలో సామాజిక న్యాయం, మత స్వేచ్ఛ పరిధిపై లోతైన చర్చ**
- **వేదాలను అత్యున్నత ప్రమాణంగా అంగీకరించడంపై వాదనలు**
- **మతం పేరుతో మహిళలపై వివక్ష చూపకూడదన్న పిటిషన్లపై విచారణ**

**నేషనల్‌బ్యూరో, (ప్రజాక్షేత్రం):**

హిందూ ధర్మం అనేది కేవలం ఒక ఆచారం మాత్రమే కాదు, అది ఒక గొప్ప జీవన విధానమని భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు మరోసారి చాటి చెప్పింది. మతపరమైన విశ్వాసాలు, ఆచారాల పరిధిని నిర్ణయించే క్రమంలో బుధవారం తొమ్మిది మంది సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేసింది. ఒక వ్యక్తి హిందువుగా తన విశ్వాసాన్ని చాటుకోవడానికి తప్పనిసరిగా దేవాలయాలను సందర్శించాల్సిన పనిలేదని, లేదా కఠినమైన ఆచారాలను పాటించాల్సిన అవసరం లేదని న్యాయస్థానం అభిప్రాయపడింది. ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ఈ ధర్మాసనం, కేరళలోని ప్రసిద్ధ శబరిమల ఆలయ ప్రవేశం మరియు మతపరమైన వివక్షకు సంబంధించిన పిటిషన్లపై విచారణ జరుపుతూ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. హిందూ మతాన్ని అనుసరించే వ్యక్తి తన ఇంట్లో లేదా ఒక చిన్న గుడిసెలో దీపాన్ని వెలిగించుకున్నా, అది అతని అచంచలమైన విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుందని, అంతకంటే మించిన నిరూపణలు అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది.

శబరిమల ఆలయంలోకి నిర్ణీత వయస్సు గల మహిళల ప్రవేశాన్ని అనుమతిస్తూ 2018లో వెలువడిన చారిత్రాత్మక తీర్పుపై దాఖలైన పునస్సమీక్ష పిటిషన్లను సుప్రీంకోర్టు ప్రస్తుతం క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. ఈ విచారణలో భాగంగా బుధవారం జరిగిన 15వ రోజు వాదనలలో పలు ఆసక్తికరమైన అంశాలు తెరపైకి వచ్చాయి. మధ్యంతర పిటిషన్ దాఖలు చేసిన ఒక పక్షం తరపున సీనియర్ న్యాయవాది డాక్టర్ జి. మోహన్ గోపాల్ తన వాదనలను వినిపించారు. 1966లో కోర్టు ఇచ్చిన ఒక తీర్పును ఆయన ఉదహరిస్తూ, వేదాలను అత్యున్నత ప్రమాణంగా అంగీకరించేవాడే హిందువు అని నిర్వచించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. హిందూ సమాజంలో ఉన్న అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండానే గతంలో ఇటువంటి నిర్ణయాలకు రావడం సరైంది కాదని ఆయన వాదించారు. నేడు హిందువులుగా పిలవబడుతున్న ప్రతి ఒక్కరూ వేదాలనే పరమ ప్రమాణంగా భావిస్తున్నారా? అనే ప్రశ్నను ఆయన ధర్మాసనం ముందుంచారు. సామాజిక న్యాయం కోసం హిందూ మతంలోని అంతర్గత వర్గాల నుంచే డిమాండ్లు వస్తున్నాయని ఆయన సభకు విన్నవించారు.



న్యాయవాది మోహన్ గోపాల్ వాదనలపై ధర్మాసనంలోని మహిళా న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న సానుకూలంగా స్పందించారు. అందుకే హిందూ మతాన్ని కేవలం ఒక మతంగా కాకుండా, విశాలమైన 'జీవన విధానంస అని పిలుస్తారని ఆమె పేర్కొన్నారు. ఒక హిందువుగా కొనసాగడానికి గుడికి వెళ్లడం లేదా నిర్దిష్ట ఆచారబద్ధమైన పద్ధతులను అనుసరించడం కచ్చితమైన నిబంధన ఏమీ కాదని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రజలు తమ అంతరాత్మలో కలిగి ఉండే విశ్వాసాలను ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదని, దానికి ఎవరూ అడ్డుపడలేరని ఆమె తేల్చి చెప్పారు. ఇదే క్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకుంటూ, మత విశ్వాసానికి భౌతికమైన నిరూపణలు అక్కర్లేదని, ఒక సామాన్యుడు తన గుడిసెలో వెలిగించుకునే చిన్న దీపం కూడా ఆ మతం పట్ల అతనికి ఉన్న అంకితభావాన్ని చాటుతుందని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు హిందూ ధర్మం యొక్క ఉదారతను మరియు వ్యక్తిగత విశ్వాసానికి ఉన్న స్వేచ్ఛను ప్రతిబింబిస్తున్నాయని న్యాయ కోవిదులు భావిస్తున్నారు.

ఈ రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్, జస్టిస్ ప్రసన్న బి వరాలే, జస్టిస్ ఆర్ మహదేవన్ మరియు జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి వంటి ప్రముఖ న్యాయమూర్తులు సభ్యులుగా ఉన్నారు. శబరిమల కేసుతో పాటు దావూదీ బోహ్రా వర్గంలోని మతపరమైన ఆచారాలు, మహిళల పట్ల వివక్ష వంటి అనేక సున్నితమైన అంశాలపై ఈ బెంచ్ విచారణ జరుపుతోంది. 2018 నాటి తీర్పులో మహిళల ప్రవేశంపై నిషేధం రాజ్యాంగ విరుద్ధమని అప్పటి సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని బెంచ్ 4:1 మెజారిటీతో తీర్పునిచ్చింది. అయితే, ఆ తీర్పును వ్యతిరేకిస్తూ దాఖలైన అనేక పిటిషన్లను ఇప్పుడు ఈ తొమ్మిది మంది న్యాయమూర్తుల బెంచ్ సమీక్షిస్తోంది. మతం మరియు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల మధ్య సమతుల్యతను కాపాడటమే ఈ విచారణ యొక్క ప్రధాన ఉద్దేశ్యం. దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతున్న ఈ కేసులో సుప్రీంకోర్టు చేసిన తాజా వ్యాఖ్యలు హిందూ మత నిర్వచనంపై కొత్త చర్చకు దారితీశాయి.





# ప్రభుత్వ పాఠశాలల్లోనే నైపుణ్యం ఉన్న ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య : జి చిన్నారెడ్డి

- **వనపర్తి విద్యా రంగ అభివృద్ధికి కృషి**
- **ఎమ్మెల్యే మెగా రెడ్డి**

**వనపర్తి, మే 13(ప్రజాక్షేత్రం):**

ప్రభుత్వపాఠశాలల్లో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం ద్వారా సమాజాన్ని గొప్పగా తీర్చిదిద్దవచ్చని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి. చిన్నారెడ్డి అన్నారు. బుధవారం ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం కింద, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని మున్నూరు కాపు ఫంక్షన్ హాల్‌లో సర్పంచులు, కౌన్సిలర్లకు రాష్ట్ర విద్యా రంగ అభివృద్ధి పై అవగాహన సదస్సు నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి డా. జి. చిన్నారెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చిన్నారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు అభివృద్ధి, ఉపాధ్యాయుల నియామకాలు, విద్యార్థుల హాజరు పెంపు, ఫలితాల మెరుగుదల కోసం అనేక చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ప్రజాప్రతినిధులు కూడా విద్యార్థుల సంఖ్య పెంపు కోసం కృషి చేయాలని సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 43 వేలకు పైగా పాఠశాలలు ఉండగా, 74 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని, వచ్చే విద్యా సంవత్సరం నుండి మధ్యాహ్న భోజనంతో పాటు బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ కూడా అమలులోకి రావడం ముఖ్యమని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు, సకల సౌకర్యాలతో ఉన్నందున పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తండ్రితల్లులను విజ్ఞప్తి చేశారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలలకు అన్ని మౌలిక సదుపాయాలు, మెరుగైన వసతులు కల్పిస్తున్నారని తెలిపారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత 32,000 మంది ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, నియామకాలు చేపట్టబడినట్లు వివరించారు. ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేసి, విద్యార్థులకు ఉచిత విద్యుత్, మధ్యాహ్న భోజన సేవలు, ఏకరూప దుస్తుల పంపిణీ మొదలైన అనేక కార్యక్రమాలు ప్రారంభించబడ్డాయని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి విద్యా రంగ అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు, జిల్లా పాఠశాలల ఉత్తీర్ణత శాతం పెంపుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. పాఠశాలల్లో గణిత, ఇతర సబ్జెక్టుల్లో ఫలితాలను మెరుగుపరచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంలో ఉపాధ్యాయులు విజయం సాధించారని తెలిపారు. కార్యక్రమంలో బాలభవన్ విద్యార్థుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే భవిత కేంద్రం ఆధ్వర్యంలో హర్ష దీక్షిత్ అనే దివ్యాంగుడికి వీల్ చైర్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యానాయక్, మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, ఇతర సర్పంచులు, కౌన్సిలర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# భవిత విద్యా వనరుల కేంద్రం మరియు నెక్స్ట్ జనరేషన్ ప్రైవేట్ స్కూల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే జారె

**అశ్వారావుపేట మే 13(ప్రజాక్షేత్రం):**

అశ్వారావుపేట మండల కేంద్రంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ భవిత విద్యా వనరుల కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం నెక్స్ట్ జనరేషన్ ప్రైవేట్ స్కూల్‌ను ప్రారంభించి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు చదువులో ముందుకు వెళ్లి మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని ఆకాంక్షించారు గ్రామీణ ప్రాంతాల్లో కూడా నాణ్యమైన విద్య అందుబాటులోకి రావడం ఆనందకర విషయమన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే విధంగా విద్యా సంస్థలు పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై ఆహారభద్రత అధికారుల తనిఖీలు

- **కరీంనగర్ బస్టాండ్ ఆవరణలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు,బేకరీలు 0**
- **కుళ్లిన గుడ్లతో ఫ్రైడ్‌రైస్.. ఒక సెంటర్ సీజ్**

**కరీంనగర్, మే 13(ప్రజాక్షేత్రం):**

కరీంనగర్ ఆహార భద్రత శాఖ ఆధ్వర్యంలో బుధవారం బస్‌స్టాండ్ కాంప్లెక్స్‌లోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. "ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్" మొబైల్ ల్యాబ్ సహాయంతో ఆహార నాణ్యత పరీక్షలు చేపట్టడంతో పాటు నిర్వాహకులకు అవగాహన కల్పించారు. తనిఖీల్లో పలుచోట్ల అక్రమాలు వెలుగుచూశాయి. చెల్లుబాటు అయ్యే ఫుడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న దుకాణాలకు నోటీసులు జారీ చేశారు. ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో వినియోగిస్తున్న టీ పొడి, వంట నూనెల నాణ్యతను పరీక్షించారు. మంచూరియా వంటి వంటకాల తయారీలో నిషేధిత ఫుడ్ కలర్స్ ఉపయోగిస్తున్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. వాటితో తయారు చేసిన ఆహార పదార్థాలను పారవేశారు. ఎస్‌ఎఫ్‌ఎస్ బేకరీలో గడువు ముగిసిన సుమారు రూ.1000 విలువైన బిస్కెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు. జ్యూస్ తయారీలో వినియోగిస్తున్న దెబ్బతిన్న ద్రాక్ష పండ్లను కూడా పారవేశారు. బస్‌స్టాండ్ కాంప్లెక్స్‌లోని కింగ్స్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో ఎగ్ ఫ్రైడ్‌రైస్ తయారీలో కుళ్లిపోయిన, దెబ్బతిన్న గుడ్లను ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. కొన్ని గుడ్లలో పురుగులు కూడా కనిపించాయని అధికారులు తెలిపారు. వెంటనే వాటిని పారవేసి, నిబంధనల ప్రకారం ఆ కేంద్రాన్ని మూసివేసి చర్యలు ప్రారంభించారు. ఆహార పదార్థాల తయారీలో నిషేధిత రంగులు, నాసిరకం పదార్థాలు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆహార భద్రత అధికారులు హెచ్చరించారు.









## తెలంగాణకు మోడీ రాకతో మేల్కొన్న కెసిఆర్....!

- ఎర్రవల్లి ఫామ్ హౌస్ లో సీనియర్ నాయకులతో సుదీర్ఘ చర్చలు
- జెడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికల్లో సత్తా చాటాలని దిశా నిర్దేశం...!
- వెనువెంటనే జిల్లాలకు ఇన్చార్జిల నియామకం

**హైదరాబాద్ మే 13(ప్రజాక్షేత్రం):**

తెలంగాణాకు మోడీ రాకతో కేసీఆర్ మేల్కొన్నారు. మోడీ సగం రోజు అక్కడే ఉండి చేసిన రాజకీయ కలకలం అంతా ఇంతా కాదు, సీఎం రేవంత్ రెడ్డిని తమతో కలవమని బంపర్ ఆఫర్ ఇచ్చారు. దాంతో ఎవరికి తోచిన విధంగా వారు దీని మీద విశ్లేషించి రచ్చ చేశారు. బిఆర్ సజిత కేసిఆర్ సీనియర్ నాయకులతో ఎర్రవల్లి ఫామ్ హౌస్ లో సుదీర్ఘ చర్చలు జరిపారు.దాదాపు ఆరు గంటల పాటు సాగిన సమావేశంలో పలు కీలక అంశాల గురించి ప్రస్తావించిన కేసీఆర్ రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని నేతలకు దిశాది నిర్దేశం చేశారు. తెలంగాణకు వచ్చిన మోడీ ఇక రెండు తెలుగు రాష్ట్రాలలో ఎన్డీయే బలోపేతం మీద మోడీ మిత్రులతో చర్చించారు అన్న వార్తలతో అటు ఆంధ్రాలో వైసీపీ ఇటు తెలంగాణాలో బీఆర్ఎస్ కూడా ఉలిక్కిపడి ఫ్యూచర్ కోర్స్ ఆఫ్ యాక్షన్ లోకి దిగిపోతున్నాయి. కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్ లో తాజాగా బీఆర్ఎస్ సీనియర్లతో అతి ముఖ్యమైన సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నడూ లేని విధంగా ఏకంగా ఆరు గంటల సేపు ఈ మీటింగ్ సాగింది అని అంటున్నారు. ఈ మీటింగ్ వేరీ సీరియస్ గానే సాగింది అని అంటున్నారు. ఏకంగా బీఆర్ఎస్ ని గ్రౌండ్ నుంచి టాప్ లెవెల్ వరకూ కొత్త రూపుతో షేపుతో తీర్చిదిద్దాలని కేసీఆర్ పార్టీ వర్గాలకు దిశా నిర్దేశం చేశారని అంటున్నారు బీఆర్ఎస్ విషయంలో పెద్ద ఎత్తున సంస్థాగత మార్పులు చేపట్టాలని కూడా డిసైడ్ అయినట్లుగా తెలుస్తోంది. అలాగే బీఆర్ఎస్ భవిష్యత్తు కార్యాచరణపై కూడా లోతైన చర్చ సాగింది అని అంటున్నారు. బీఆర్ఎస్ ని పూర్తిగా గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అధినాయకుడు కేసీఆర్ పార్టీ వర్గాలకు సూచించారు అని అంటున్నారు. గతానికి భిన్నంగా తెలంగాణా రాజకీయం మారుతోంది అని బీఆర్ఎస్ పెద్దలు గుర్తించారు. బీజేపీ తెలంగాణాలో అధికారం విషయంలో గట్టి పట్టుదలతో ఉందని కూడా అర్థం అవుతోంది. మోడీ బహిరంగ సభలో అయితే వచ్చేది బీజేపీనే అని స్ట్రాంగ్ స్టేట్మెంట్ ఇచ్చారు. బీజేపీ కనుక ఒక చోట అధికారంలోకి రావాలనుకుంటే దానికి సంబంధించి గ్రౌండ్ వర్క్ చాలా ముందుగానే రెడీ చేసి పెట్టుకుంటుంది. దానికి తాజా ఉదాహరణ పశ్చిమ బెంగాల్ లో ఆ పార్టీ ఘన విజయం. అసలు ఓటమి లేదు అనుకున్న మమతా బెనర్జీ ఓటమి పాలు అయ్యారు. దాంతో అంతకంటే బలమైన ప్రాంతీయ పార్టీల నేతలు ఎవరూ లేరని అంటున్నారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ కూడా పూర్తి స్థాయిలో అలెర్ట్ అవుతోంది అని అంటున్నారు.

**కమిటీలతో దూకుడు**

ఇక బీఆర్ఎస్ ని బూత్ లెవెల్ నుంచి గ్రామ వార్డు స్థాయి నుంచి కమిటీలతో నింపాలని నిర్ణయించారు. అలాగే నియోజకవర్గం స్థాయి జిల్లా స్థాయి వరకూ కూడా బలమైన సమర్థులైన నాయకులతో పార్టీని పటిష్టం చేయాలని కూడా నిర్ణయించారు ఇక పార్టీ శ్రేణులలో సరికొత్త ఉత్సాహం నింపాలని రానున్న రోజులలో నేతలంతా జనంలో ఉంటూ బీఆర్ఎస్ ని పరుగులు పెట్టించాలని కూడా తీర్మానించారని అంటున్నారు. జీహెచ్ఎంసీ సహా ఏ ఎన్నికలు జరిగినా విజయమే పరమాధిగా పార్టీ పోరాడాలని కూడా నిర్ణయించారు. మొత్తానికి 2028 ఎన్నికలకు బీజేపీ రెడీ అని మోడీ గట్టిగా చెప్పి వెళ్లారు. దాంతో బీఆర్ఎస్ కూడా జోరు చేస్తోంది అని అంటున్నారు. డిజిటలైజేషన్ పద్ధతిలో సభ్య నమోదు చేయాలని నిర్ణయించినందున రాష్ట్రంలో వున్న 35,655 పోలింగ్ బూత్ లలో, బూత్ కు ఇద్దరు కార్యకర్తల చొప్పున మొత్తం 71,310 మంది పార్టీ కార్యకర్తలకు డిజిటల్ మెంబర్ షిప్ ప్రక్రియకు సంబంధించిన విధి విధానాల పై శిక్షణాతరగతులు నిర్వహించాలని కేసీఆర్ ఆదేశించారు. పార్టీ సభ్యత్వ నమోదు, డిజిటల్ పద్ధతిలో చేపట్టేందుకు తగిన శిక్షణా శిభిరాలను పార్టీ ప్రధాన కార్యదర్శుల ఆధ్వర్యంలో కొనసాగించాలని కేసీఆర్ నిర్ణయించారు.

**సభ్యత్వ నమోదు కార్యక్రమం కోసం నియమించబడిన ఇంచార్జీలు:**

ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలు తక్కళ్లపల్లి రవీందర్ రావు

జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాలు - మాజీ మంత్రి జీవన్ రెడ్డి

ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలు - సత్యవతి రాథోడ్

జనగాం, హనుమకొండ, వరంగల్ జిల్లాలు పల్లా రాజేశ్వర్ రెడ్డి

మెదక్, సంగారెడ్డి, సిద్ధిపేట జిల్లాలు - గ్యాదరి బాలమల్లు

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలు గంగాధర్ గౌడ్

మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలు నారదాసు లక్ష్మణ్ రావు

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలు రావుల శ్రావణ్ కుమార్ రెడ్డి

వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలు సబితా ఇంద్రారెడ్డి

మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలు —— మహమూద్ అలీ

గద్వాల్,నాగర్‌కర్నూల్,వనపర్తి జిల్లాలు—— మెట్టు శ్రీనివాస్మే

డ్చల్‌మల్కాజిగిరి,యాదాద్రి జిల్లాలు —— పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్ జిల్లా —— తలసాని శ్రీనివాస్ యాదవ్న

ల్గొండ, సూర్యాపేట జిల్లాలు —— ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్

## ఎన్టీఏను రద్దు చేయాలి.

- మండల కార్యదర్శి చరణ్ గౌడ్.

**మొయినాబాద్, మే 13(ప్రజాక్షేత్రం):**



దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న నీట్ పరీక్షా పత్రాల లీకేజీ వ్యవహారంపై విద్యార్థి లోకం భగ్గుమంటోంది. పరీక్షల నిర్వహణలో వరుస వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర ప్రభుత్వం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీను తక్షణమే రద్దు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మొయినాబాద్ మండల కార్యదర్శి చరణ్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం మొయినాబాద్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... లక్షలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థుల డాక్టర్ కలలను కేంద్ర ప్రభుత్వం బజారున పడేస్తోందని మండిపడ్డారు. పారదర్శకత లేని పరీక్షా విధానం వల్ల రాత్రింబవళ్లు కష్టపడి చదివిన విద్యార్థులకు అన్యాయం జరుగుతుంటే, ధనవంతులు పేపర్లను కొనుగోలు చేసి సీట్లు పొందుతున్నారని విమర్శించారు. "పరీక్షా వ్యవస్థలో జవాబుదారీతనం లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. నీట్ వంటి జాతీయ స్థాయి పరీక్షల్లో పేపర్ లీకేజీలు జరగడం కేంద్ర ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం" అని ఆయన ధ్వజమెత్తారు. ఈ కుంభకోణానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు న్యాయం చేసేలా విశ్వసనీయమైన ప్రజాస్వామ్య పరీక్షా వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులను ఏకం చేసి దేశవ్యాప్త పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

## పెద్దేముల్ పెద్ద చెరువు కట్ట గండి విషయంలో స్పందించిన ఇరిగేషన్ అధికారులు

- పెద్ద చెరువు కట్ట గండిని పరిశీలించిన ఇరిగేషన్ శాఖ వర్క్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్
- ఇరిగేషన్ శాఖ డీఈ,ఏఈల అదేశాల మేరకు చెరువు కట్ట గండిని పరిశీలించిన వర్క్ ఇన్స్పెక్టర్ గండిని పూడ్చడానికి ఎస్టిమేషన్లు తయారు చేయనున్న ఇరిగేషన్ శాఖ అధికారులు
- "పెద్దేముల్ పెద్ద చెరువు కట్టకు మళ్ళీ గండి భయం" అనే శీర్షికతో ప్రత్యేక కథనాన్ని ప్రచురించిన "ప్రజాక్షేత్రం" దినపత్రిక
- హర్షం వ్యక్తం చేస్తూ ప్రజాక్షేత్రం దినపత్రికకు, పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై నర్సింహులు, ఉప సర్పంచ్ డివై ప్రసాద్ లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపిన పెద్దేముల్ గ్రామ ప్రజలు, పంట పొలాల రైతులు,తదితరులు


పెద్దేముల్ పెద్ద చెరువు కట్టకు
మళ్లీ గండి భయం
- పెద్దేముల్ పెద్ద చెరువు కట్టను రైతులతో కలిసి పరిశీలించిన పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై నర్సింహులు, ఉపసర్పంచ్ డివై ప్రసాద్
- గండి పడే ప్రమాదం.. వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి
- గతంలో ఒకసారి పెద్ద చెరువు కట్టకు భారీ గండి పడి వరద నీటిలో కొట్టుకుపోయిన పంట పొలాలు
- గండి పడకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్న పెద్దేముల్ గ్రామ ప్రజలు, రైతులు, ప్రజా ప్రతినిధులు




**పెద్దేముల్, మే 13(ప్రజాక్షేత్రం):**

పెద్దేముల్ పెద్ద చెరువు కట్టకు మళ్ళీ గండి భయం అనే శీర్షికతో ప్రజాక్షేత్రం దినపత్రిక ప్రచురించిన కథనానికి నీటిపారుదల శాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు నీటిపారుదల శాఖ డీఈ శిరీష,ఏఈ శ్యాం ప్రసాద్ ల ఆదేశాల మేరకు నీటిపారుదల శాఖ వారికి వర్క్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ బుధవారం మధ్యాహ్నం సమయంలో పెద్దేముల్ గ్రామ శివారులోని పెద్ద చెరువు కట్టను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ మేరకు ప్రమాదకరంగా మారిన పెద్దేముల్ పెద్ద చెరువు కట్ట గండి కి సంబంధించి పూర్తి కొలతలను తీసుకున్నారు. గండికి సంబంధించి కొలతలను సేకరించి ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగంలో నిధుల మంజూరు కోసం ఎస్టిమేషన్లను తయారు చేసి పంపడం జరుగుతుందని వర్క్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. గండిని పూడ్చడానికి నిధులు మంజూరైన వెంబడే పనులను ప్రారంభించి ప్రమాదకరంగా మారిన పెద్దేముల్ పెద్ద చెరువు కట్ట గండిని పూడ్చడం జరుగుతుందని వర్క్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా మంగళవారం పెద్దేముల్ పెద్ద చెరువు కట్ట గండిని పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై నర్సింహులు, ఉప సర్పంచ్ డివై ప్రసాద్ లు స్థానిక రైతులతో కలిసి ప్రమాదకరంగా మారిన చెరువు కట్ట గండిని పరిశీలించారు. అదే విషయాన్ని పెద్దేముల్ మండల ప్రజా క్షేత్రం దినపత్రిక ప్రతినిధి "పెద్దేముల్ పెద్ద చెరువు కట్టకు మళ్ళీ గండి భయం" అనే శీర్షికతో ఒక ప్రత్యేక కథనాన్ని బుధవారం ప్రచురించడంతో నీటిపారుదల శాఖ అధికారులు వెంటనే స్పందించి ఆ గండిని పూడ్చడానికి ఎస్టిమేషన్లు తయారు చేయడంతో స్థానిక రైతులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై నర్సింహులు, ఉపసర్పంచ్ డివై ప్రసాద్, పెద్దేముల్ మండల ప్రజాక్షేత్రం దినపత్రికకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



## ధాన్యం తరలింపులో జాప్యం: నర్సంపేటవరంగల్ రహదారిపై రైతుల ధర్నా

**నర్సంపేట మే 13(ప్రజాక్షేత్రం):**

నర్సంపేట నుండి వరంగల్ వెళ్లే ప్రధాన రహదారిపై ఈరోజు రైతులు భారీ ధర్నా నిర్వహించారు. కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో తీవ్ర జాప్యం జరుగుతుందని తరలించిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడంలో ఆలస్యం జరుగుతుందని రైతులు ఆందోళనకు దిగారు.

**రహదారి దిగ్బంధం**

ధాన్యం బస్తాలతో కూడిన ట్రాక్టర్లను రోడ్డుకు అడ్డంగా నిలిపి రైతులు బైఠాయించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

**ప్రయాణికుల ఇబ్బందులు:**

ధర్నా కారణంగా బస్సులు, కార్లు, ఆటోలు కిలోమీటర్ల మేర నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**రైతుల డిమాండ్**

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోయాయని, వర్షాలు వచ్చే సూచనలు ఉన్నందున వెంటనే లారీలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని రైతులు డిమాండ్ చేశారు.

**అధికారుల స్పందన**

సమాచారం అందుకున్న పోలీసులు మరియు రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని రైతులతో చర్చలు జరిపారు. ధాన్యం తరలింపునకు తక్షణ చర్యలు చేపడతామని, 24 గంటల్లోగా లారీలను ఏర్పాటు చేసి నిల్వ ఉన్న ధాన్యాన్ని పూర్తిగా తరలిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు తమ ధర్నాను విరమించారు.

## చలివేంద్రమును ప్రారంభించిన ఎమ్మెల్యే కుంభం

**వలిగొండ మే 13(ప్రజాక్షేత్రం):**

వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీరు మరియు శీతల పానీయాలు అందించేందుకు వలిగొండ కేంద్రంలో ఎఫ్ ఎస్ సి ఏ క్లబ్ ఆధ్వర్యంలో కోర్లపల్లి కమలమ్మవిశ్వనాథం కుమారులు మురారి శెట్టి కృష్ణ మూర్తి, కొర్లపల్లి శ్రీనివాస్ ముందుకు వచ్చి స్థానికంగా మెయిన్ రోడ్డు వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి వలిగొండ సర్పంచ్, ఎఫ్ ఎస్ సి ఏ సభ్యులు కుంభం వెంకట్ పాపిరెడ్డిలతో కలసి మెయిన్ రోడ్డు ప్రక్కన చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మురారి శెట్టి కృష్ణ మూర్తి కొర్లపల్లి శ్రీనివాస్ లను ముందుకొచ్చి సేవ కార్యక్రమంలో పాల్గొన్నందుకు అభినందించారు. ఎండ తీవ్రత కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తగ్గించేందుకు ఈ చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు కూడా ఈ సేవను వినియోగించుకోవాలని, అలాగే ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నుకోబడిన అధ్యక్షుడు బత్తిని శెట్టయ్య గౌడ్ కు ఎమ్మెల్యే కుంభం అభినందలు తెలిపారు. ఈ వేసవికాలం ముగిసే వరకు ఈ చలివేంద్రం కొనసాగించబడుతుంది మురారి శెట్టి కృష్ణ మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మురారి శెట్టి కృష్ణ మూర్తి, బత్తిని శెట్టయ్య, సుంకి వెంకటేష్, పిట్టల రాజు, కొందూరు భాస్కర్, కాసుల వెంకన్న, బత్తిని బాల్శెట్టి, కీర్తి రమేష్, అయిటి పాముల రవి, అయిటి పాముల ప్రభాకర్, యనాల సత్యనారాయణ రెడ్డి, కూర శ్రీనివాస్, ఎల్లంకి మురళీ, తదితరులు పాల్గొన్నారు.



## బక్రీద్ పండుగ నేపథ్యంలో శాంతిభద్రతలపై డీజీపీ వీడియో కాన్ఫరెన్స్

**కరీంనగర్ కమిషనరేట్, మే 13 (ప్రజాక్షేత్రం) :**

రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ పై తెలంగాణ రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ ఐపీఎస్ బుధవారం జిల్లా స్థాయి పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా పోలీస్ శాఖ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రార్థనా స్థలాలు, ఈద్గాలు, మసీదులు, ప్రధాన రహదారులు, మార్కెట్ ప్రాంతాలు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పండుగ రోజున ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని, ఈద్గాల వద్ద పార్కింగ్ ఏర్పాట్లు, ట్రాఫిక్ మళ్లింపులు, అత్యవసర సేవలకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులు, వదంతులు వ్యాప్తి చెందకుండా సైబర్ మానిటరింగ్‌ను బలోపేతం చేయాలని సూచించారు. అనుమానాస్పద సమాచారం తెలిసిన వెంటనే స్థానిక పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, శాంతి కమిటీ సభ్యులతో ముందస్తు సమావేశాలు నిర్వహించి సామరస్య వాతావరణంలో పండుగను జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, సీసీ కెమెరాల పర్యవేక్షణతో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. పండుగ విధుల్లో పాల్గొనే పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని డీజీపీ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా బక్రీద్ పండుగను శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు శ్రీనివాస్, విజయ కుమార్, వెంకటస్వామి తదితర అధికారులు పాల్గొన్నారు.




## వంజరి సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే పైడి, పల్లె

**నిజామాబాద్ మే 13(ప్రజాక్షేత్రం):**

నిజామాబాదు జిల్లా వంజరి సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం నాడు అడవి మామిడి పల్లి వంజరి సంఘం ఫంక్షన్ హాల్ లో ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప లోపల కులమని గడప దాటితే హిందూ అని మర్చిపోవద్దని ప్రతి ఒక్కరూ కులంతో పాటు మతాన్ని కూడా మరువకూడదని వంజరి సంఘానికి తన గెలుపును ప్రత్యేక పాత్ర ఉందని జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్న శంకర్ కూడా బిజెపి సీనియర్ నాయకులని వంజరి సంఘ భవనానికి తన వంతుగా ఎమ్మెల్యే నిధులనుండి కొంతమేర మంజూరు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# 18వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతా.

- ప్రజల మౌలిక అవసరాలకే మా ప్రాధాన్యం
- కౌన్సిలర్ అరుణ రామకృష్ణ గౌడ్.



**మొయినాబాద్, మే 13(ప్రజాక్షేత్రం):**

మొయినాబాద్ మున్సిపాలిటీలోని 18వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, మున్సిపాలిటీలోనే ఒక ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని కౌన్సిలర్ చేగురి అరుణ రామకృష్ణ గౌడ్ స్పష్టం చేశారు. పెద్దమంగళారం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి గాను నూతనంగా ఏర్పాటు చేసిన బోర్ మోటార్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా అరుణ గౌడ్ మాట్లాడుతూ.. వార్డు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడటమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. "ప్రజల మౌలిక అవసరాలు తీర్చడమే మా కర్తవ్యం. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తుగా పాత మోటార్ స్థానంలో కొత్తది బిగించాం" అని తెలిపారు. మాజీ సర్పంచ్ చేగురి రామకృష్ణ గౌడ్ సూచనలతో వార్డులోని ప్రతి గల్లీలో సమస్యలను గుర్తించి, వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని ఆమె వివరించారు. కేవలం తాగునీరే కాకుండా, పారిశుధ్యం, వీధి దీపాలు మరియు ఇతర మౌలిక సదుపాయాల కల్పనలో 18వ వార్డును అగ్రగామిగా నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు. బోర్ మోటార్ రీప్లేస్‌మెంట్‌కు సహకరించిన మున్సిపల్ అధికారులకు ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు. తమ సమస్యపై తక్షణమే స్పందించి పరిష్కరించిన కౌన్సిలర్ పట్ల వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# జనగణన దేశాభివృద్ధికి కీలక పునాది

- జనగణన-2027 గృహ గణన పనులను పరిశీలించిన జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్
- గడువులోగా 100 శాతం గణన పూర్తి చేయాలని సూచన
- సెల్ఫ్ ఎన్యూమరేషన్ డేటా ధృవీకరణ వేగవంతం చేయాలి

**కుత్బుల్లాపూర్, మే 13(ప్రజాక్షేత్రం)**


సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ బుధవారం గాజులరామారం సర్కిల్ పరిధిలోని షాపూర్‌నగర్ వార్డులో పర్యటించి, జనగణన 2027 తొలి దశలో కొనసాగుతున్న గృహ గణన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లతో ముఖాముఖి మాట్లాడిన ఆయన, డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్న గణన ప్రక్రియను సమీక్షించారు. మొబైల్ యాప్‌లో ప్రతి ఇంటి నంబరు, కుటుంబ సభ్యుల ప్రాథమిక వివరాలు, గృహ వసతుల సమాచారం ఎటువంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన 33 రకాల ప్రశ్నలపై ఎన్యూమరేటర్లకు పూర్తి అవగాహన ఉండాలని, ప్రజల నుంచి సేకరించిన సమాచారాన్ని అత్యంత గోప్యంగా ఉంచాలని ఆయన స్పష్టం చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ, దేశాభివృద్ధి మరియు భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనలో జనగణన కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా స్వయంగా వివరాలు నమోదు చేసుకున్న కుటుంబాల (సెల్ఫ్ ఎన్యూమరేషన్) డేటాను సిస్టమ్‌లో ధృవీకరించి, సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.



# అక్రమ నిర్మాణాలపై కొనసాగనున్న కఠిన చర్యలు





- అక్రమ షెడ్లపై దుండిగల్ అధికారుల చర్యలు
- పర్మిషన్ లేకుండా నిర్మాణాలు..మూడు చోట్ల డిమాలిషన్

**కుత్బుల్లాపూర్, మే 13(ప్రజాక్షేత్రం):**

దుండిగల్ సర్కిల్ పరిధిలో అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న షెడ్లపై అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. పోలీస్ స్టేషన్ బ్యాక్ సైడ్, అపర్ణ వెంచర్ సమీపం, సారెగూడెం రోడ్డు వద్ద పర్మిషన్ లేకుండా నిర్మాణాలు జరుగుతున్నట్లు గుర్తించిన టౌన్ ప్లానింగ్ అధికారులు వాటిని డిమాలిష్ చేశారు. అధికారుల తెలిపిన వివరాల ప్రకారం, నగర నిర్మాణ నిబంధనలను ఉల్లంఘిస్తూ చేపట్టిన ఈ షెడ్ నిర్మాణాలపై ముందస్తు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో కూల్చివేత చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్‌తో పాటు టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు. భవిష్యత్తులో కూడా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు.

# అమాయకుల ప్రజలే ఆ ఇద్దరి విలేకరుల టార్గెట్ ..!

- రెవెన్యూ అధికారుల అండదండలతో ఆ ఇద్దరు విలేకరుల వసూల్ దందా
- రెవెన్యూ కార్యాలయంలో బ్రోకర్ వ్యవస్థ భూస్థాపం చేయాలని ప్రజాసంఘాల డిమాండ్







**పెద్దకడబూరు మే 13(ప్రజాక్షేత్రం):**

పెద్దకడబూరు మండల కేంద్రమైన తాసిల్దార్ కార్యాలయంలో కొందరికి అక్రమ వసూళ్లకు వేదికగా మారింది. వివిధ గ్రామాల నుండి ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన చోట విలేకరుల ముసుగులో ఉన్న ఇద్దరు వ్యక్తులు తిష్టి వేసుకుని బాధితులను నిలువు దోపిడి చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పెద్దకడబూరు మండలం మండల తాసిల్దార్ కారణం కేంద్రంగా సాగుతున్న ఈ దందా ఇప్పుడు మండలంలో సంచలనంగా మారింది.

**తాసిల్దార్ కార్యాలయం అడ్డాగా భేరాసారాలు**

తాసిల్దార్ కార్యాలయానికి తమ భూములకు న్యాయం కోసం వచ్చే సామాన్య ప్రజలను ఈ ఇద్దరు విలేకరులు టార్గెట్ చేస్తున్నారు బాధితులు రాగానే అధికారులు కంటే ముందే వీరు రంగ ప్రవేశం చేసి సమస్యను పరిష్కరిస్తామంటూ మధ్యవర్తిత్వం వహిస్తున్నారు. రైతుల నుంచి వేలకు వేల రూపాయలు వసూలు చేయడం, అందులో కొంత భాగం అధికారులకు చేరుస్తూ, మిగిలినది తమ జేబుల్లో వేసుకుంటున్నారని స్థానికులు బహిరంగనే చర్చించుకుంటున్నారు...

**ప్రశ్నిస్తే బెదిరింపులు....?**

ఈ అక్రమ దందాను మోసపోయిన రైతులు ప్రశ్నిస్తే పై వీరు ప్రతాపం చూపిస్తున్నారు. రెవిన్యూ శాఖలోని కొంతమంది అధికారుల అండ చూసుకుని, ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారు. "మేము చెప్పిందే చట్టం.. మాకు అడ్డొస్తే అక్రమ కేసుల్లో ఇరికిస్తాం" అంటూ సామాన్య ప్రజలను బెదిరించడం వీరి బరితెగింపుకు నిదర్శనం. ఓ అధికారి అన్నదండలతో వీరు చేస్తున్న ఈ అరాచకాలు సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.

**ఉన్నతాధికారులు స్పందించాలి:**

పెద్దకడబూరు మండల రెవెన్యూ కార్యాలయంలో రాజ్యమేలుతున్న ఈ బ్రోకర్ వ్యవస్థపై జిల్లా కలెక్టర్ మరియు సబ్ కలెక్టర్ అధికారులు తక్షణమే దృష్టి సారించాల్సిన. అవసరం ఉంది. రెవెన్యూ అధికారుల పేరు వాడుకుంటూ సామాన్యులను పీడిస్తున్న ఆ ఇద్దరు విలేఖరుల వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరో తేలాల్సి ఉంది. జర్నలిజం ముసుగులో అక్రమాలకు



పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే, వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకం సన్నగిల్లే ప్రమాదం ఉందని జర్నలిస్ట్ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి..

# పారదర్శకంగా జనగణన నిర్వహణ: డిప్యూటీ కమిషనర్

- రేపటి నుంచి ఇంటింటి జనగణన సర్వే
- జూన్ 9 వరకు కొనసాగనున్న గృహ గణన
- ప్రతి కుటుంబం బాధ్యతగా సహకరించాలని పిలుపు



**కుత్బుల్లాపూర్ మే 13(ప్రజాక్షేత్రం):**

దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కిరణ్ మాట్లాడుతూ, జనగణన-2027 తొలి దశ గణన కార్యక్రమం రేపటి నుంచి జూన్ 9 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం భాగంగా ప్రత్యేక సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహిస్తారని వెల్లడించారు. ఈ సర్వేలో ప్రతి ఇంటి ప్రాథమిక వివరాలు, కుటుంబ సభ్యుల సంఖ్య, నివాస పరిస్థితులు తదితర అవసరమైన సమాచారాన్ని సేకరిస్తామని తెలిపారు. జనగణన ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఇంటింటికి వచ్చే గణన సిబ్బందికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు. సరైన, ఖచ్చితమైన సమాచారం ఇవ్వడం ద్వారా ప్రభుత్వానికి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడంలో ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. జనగణన ద్వారా విద్య, వైద్యం, మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలు వంటి అనేక రంగాలకు అవసరమైన గణాంకాలు సిద్ధమవుతాయని తెలిపారు. ప్రజల సహకారంతో జనగణన కార్యక్రమం విజయవంతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి కుటుంబం ఈ కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకుని గణన సిబ్బందికి సహకరించాలని డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కిరణ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ధాన్యం కేంద్రంలో మంత్రి సీరియస్..

- రైతులను ఇబ్బంది పెట్టొద్దు అధికారులకు పొన్నం ఆదేశాలు..
- నవాబ్‌పేటలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు

**చిగురుమామిడి, మే 13(ప్రజాక్షేత్రం):**

మండలంలోని నవాబ్‌పేట గ్రామంలో మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం పర్యటించాడు. ముందుగా గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి, వరి కొనుగోళ్లు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, అలసత్వం ప్రదర్శిస్తే సహించబోమని హెచ్చరించారు. ప్రస్తుతం భారీగా ధాన్యం కేంద్రాలకు వస్తోందని, గన్నీ బ్యాగుల కొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. కొనుగోలు పూర్తయిన ధాన్యం సంచులను వెంటనే లారీల ద్వారా మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఆకస్మిక వర్షాల వల్ల ధాన్యం తడవకుండా ప్రతి కేంద్రంలో టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ధాన్యం రవాణాలో ఆటంకాలు లేకుండా ప్రత్యేకంగా ఎంపీఐ అధికారిని నియమించినట్లు తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా హమాలీలకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఐకేపీ కేంద్రాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు, గ్రామ ధాన్యం కొనుగోలు కమిటీలు సమన్వయంతో పని చేసి కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. అనంతరం నవాబ్‌పేటలో బోదాసు లలిత-రవి కుటుంబానికి మంజూరైన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గానికి ఇప్పటికే 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, పలువురు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు నిర్వహిస్తున్నారని మంత్రి తెలిపారు. రెండో దశ ఇందిరమ్మ ఇళ్ల పథకం జూన్ నుంచి ప్రారంభం కానుందని వెల్లడించారు. ఇళ్లు మంజూరైన వారు నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని, స్థానిక నాయకత్వం సహకారం అందించాలని సూచించారు. గత పదేళ్లలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందని అనేక మంది ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుని సంతోషంగా గృహప్రవేశాలు చేస్తున్నారని చెప్పారు. ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని, ఈ ఏడాది కూడా మరో 3,500 ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.






# పేట్ బషీరాబాద్ పీఎస్ ముందు మహిళా సంఘాల ధర్నా

- మైనర్ బాలిక వేధింపుల కేసులో చర్యలు తీసుకోవాలంటూ ఆందోళన
- బండి సంజయ్‌ను మంత్రి పదవి నుంచి తొలగించాలి: మహిళా సంఘాల డిమాండ్
- - ఐఎఫ్ టియు,పీడీఎస్‌యు,పిఓడబ్ల్యూ సంఘాల బైఠాయింపు..పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత

**కుత్బుల్లాపూర్, మే 13(ప్రజాక్షేత్రం):**

పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ముందు బుధవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మైనర్ బాలికను లైంగికంగా వేధించిన కేసులో బండి సంజయ్ కుమారుడు బండి భగీరత్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్ టియు , పీడీఎస్ యు, పిఓడబ్ల్యూ మహిళా సంఘాల నాయకులు, కార్యకర్తలు పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల నేతలు మాట్లాడుతూ, బాధిత కుటుంబం ఫిర్యాదు చేసి ఎన్నో రోజులు గడుస్తున్నప్పటికీ ఇప్పటి వరకు నిందితుడిపై చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. పేదలకు ఒక న్యాయం, పెద్దలకు మరో న్యాయం అమలు చేస్తున్నారా అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఐఎఫ్ టియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అనురాధ మాట్లాడుతూ, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను వెంటనే మంత్రి పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల ముందు ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఇటీవల జరిగిన ప్రధాని మోదీ సభలో బండి సంజయ్ తనను తాను పవిత్రుడిగా చెప్పుకోవడం విచిత్రమని, తన కుమారుడిపై వచ్చిన ఆరోపణలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. అధికారంలో ఉండి ఇలాంటి వ్యవహారాలను కప్పిపుచ్చే నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పిఓడబ్ల్యు జాతీయ నాయకురాలు సంధ్య, ఐఎఫ్ టియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అనురాధతో పాటు పలువురు మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రతిరోజూ ఒక వార్డు కార్యక్రమంలో ప్రజలతో ముఖాముఖి

- ప్రజా సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో కమిషనర్ సృజన పర్యటన
- వార్డు అభివృద్ధిపై అధికారులకు కమిషనర్ ఆదేశాలు

**కుత్బుల్లాపూర్, మే 13(ప్రజాక్షేత్రం):**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కింద సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. సృజన ప్రతిరోజూ "ఒక వార్డు" కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని జీడిమెట్ల సర్కిల్‌లో గల కుత్బుల్లాపూర్ వార్డు నంబర్-286లోని గవర్నమెంట్ హైస్కూల్, జీడిమెట్లలో క్షేత్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక ప్రజలతో కమిషనర్ ముఖాముఖిగా మాట్లాడి వార్డు పరిధిలో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. కాలనీల్లో పారిశుధ్యం, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, చెత్త సేకరణ తదితర సమస్యలను ఆర్డబ్ల్యూఏ ప్రతినిధులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు, ఫిర్యాదులను సంబంధిత అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే లక్ష్యంగా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పింకేష్ కుమార్ ( జోనల్ కమిషనర్, కుత్బుల్లాపూర్ జోన్), డి. శంకర్ సింగ్ ( డిసి 55), బద్రి నాయక్ (ఈఈ నిర్వహణ), మచందర్ (టీపీఎస్), మహేందర్ (మేనేజర్, యుబిడి ), శివప్రకాశ్ (ఎస్ డబ్ల్యూఎం డిప్యూటీ ఈఈ ), డాక్టర్ కె. నాగార్జున (వెటర్నరీ డాక్టర్), భాను తేజ గౌడ్ (ఎఫ్ఎస్ఓ ), గోపాలకృష్ణ ( ఏఈ మెయింటెనెన్స్), జిలానీ పాషా, జవాన్లు, శానిటేషన్ సిబ్బంది, అలాగే వార్డు నంబర్ 286కు చెందిన ఆర్డబ్ల్యూఏ సభ్యులు పాల్గొన్నారు.



## నీట్ పరీక్షలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- **నీట్ అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి:యుఎస్ఎఫ్ఐ**
- **విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడొద్దు:చంద్రకాంత్**



**కుత్బుల్లాపూర్, మే 13(ప్రజాక్షేత్రం):**
నీట్ పరీక్షల్లో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని యుఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు ఎం. చంద్రకాంత్ డిమాండ్ చేశారు. షాపూర్ నగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ పరీక్షలో వరుసగా జరుగుతున్న అవకతవకలు విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీలు, మాస్ కాపీయింగ్, మార్కుల మానిప్యులేషన్ వంటి ఘటనలు విద్యా వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయని పేర్కొన్నారు. లక్షలాది మంది విద్యార్థులు కష్టపడి పరీక్షలకు సిద్ధమవుతుంటే అక్రమాల కారణంగా ప్రతిభకు అన్యాయం జరుగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం మరియు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టిఏ) వెంటనే పూర్తి స్థాయి విచారణ చేపట్టి నిజాలను వెలికి తీయాలని కోరారు. అక్రమాలకు బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే విధానాలను సహించబోమని, అవసరమైతే విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కృషి, సాయి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పిట్టల విజయ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న బీసీ జిల్లా అధ్యక్షులు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్

**చెన్నారావుపేట మే 13(ప్రజాక్షేత్రం):**
వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం చెన్నారావుపేట మండల కేంద్రంలో సీనియర్ పాత్రికేయులు మిత్రులు నమస్తే తెలంగాణ నర్సంపేట రిపోర్టర్ పిట్టల కుమార్, రాజు ల మాతృమూర్తి పిట్టల విజయ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు మరియు నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ పాల్గొని విజయ చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు రాజోజు రవీందర్, జినుకల రాజు, పిట్టల సాంబయ్య, జినుకల సతీష్, బోనగిరి ఎల్లన్న తదితరులు పాల్గొన్నారు.



## ఫిర్యాదు చేస్తే చాలు.. ఫోన్ తిరిగి మీ చేతిలోనే

- **సీఐ ఏ. నిరంజన్ రెడ్డి**

**కరీంనగర్ రూరల్, మే 13(ప్రజాక్షేత్రం)**
బొమ్మకల్ గ్రామానికి చెందిన బెజ్జంకి శివ శంకర్ తన వివో సెల్‌ఫోన్‌ను చల్మెడ ఆనందరావు ఆస్పత్రి వద్ద పోగొట్టుకున్నాడు. ఈ మేరకు కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ సహాయంతో ఫోన్‌ను ట్రేస్ చేశారు. అనంతరం ఖాన్‌పురా ప్రాంతంలో ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. తర్వాత సెల్‌ఫోన్‌ను యజమాని శివశంకర్‌కు ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి అందజేశారు. ఫోన్ ట్రేసింగ్‌లో కీలకంగా పనిచేసిన టెక్ టీం కానిస్టేబుల్ చిట్యాల రామ్‌సాయి, మహిళా కానిస్టేబుల్ సుప్రియలను ఇన్‌స్పెక్టర్ అభినందించారు.




## విద్యుత్' ఆస్తుల విభజనకు రంగం సిద్ధం

**తెలంగాణ బ్యూరో, ప్రజాక్షేత్రం :**
విద్యుత్ సంస్థల్లో ఆస్తుల విభజనకు రంగం సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేస్తున్న తెలంగాణ రైతు విద్యుత్ పంపిణీ సంస్థ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నుంచి పూర్తిస్థాయి కార్యకలాపాలు నిర్వహించనున్న నేపథ్యంలో ఆస్తుల విభజనపై దృష్టిసారిస్తోంది. కేవలం రెండు నెలల వ్యవధిలో ఎంసీఏ ఆమోదం పొందడం, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు(పీపీఏ) పూర్తి చేయడం, కీలకంగా భావించే ఉద్యోగుల విభజన ప్రక్రియ తుది దశకు చేరుకున్నది. క్షేత్ర స్థాయిలో కార్యకలాపాలు నిర్వహించడానికి కీలకమైన ఆస్తుల విభజనలో భాగంగా మొదటిగా వ్యవసాయ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల సర్వే పై దృష్టిపెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 5.60 లక్షల వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా.. సెక్షన్‌కు మూడు టీంల చొప్పున, 744 ఆపరేషన్ సెక్షన్లలో 2,232 బృందాలు ప్రతిరోజు ఈ సర్వేలో పాల్గొనేలా ప్రణాళికలు రూపొందించారు. సర్వే కోసం రైతు డిస్కం ప్రత్యేక యాప్ రూపొందించింది. ఈ యాప్ ద్వారా అసిస్టెంట్ ఇంజినీర్లు తమ పరిధిలోని వ్యవసాయ డీటీఆర్‌లకు సంబంధించిన స్ట్రక్చర్, డీటీఆర్ ఎంబోస్ నెంబర్, నేమ్‌ప్లేట్ వివరాలను ఫొటోల రూపంలో సేకరించి, ఆయా ట్రాన్స్‌ఫార్మర్ల జియో కోఆర్డినేట్లను నమోదు చేయనున్నారు.

**ట్రాన్స్‌ఫార్మర్ల సర్వేపై విస్తృత చర్చ**
ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ డిస్కంల సీఎండీలు, సీనియర్ అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో రైతు డిస్కం పరిధిలోకి తీసుకురానున్న వ్యవసాయ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల సర్వేపై విస్తృతంగా చర్చించారు. ఇప్పటికే రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో పైలట్ ప్రాతిపదికన కొన్ని వ్యవసాయ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల సర్వే విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ నెల 28వ తేదీన విద్యుత్ నియంత్రణ కమిషన్(ఈఆర్సీ) రైతు డిస్కంకు లైసెన్స్ మంజూరు అంశంపై బహిరంగ విచారణ నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే అసెట్ మ్యాపింగ్ ప్రక్రియ కూడా పూర్తయితే, ప్రభుత్వ నిర్ణయానుసారం జూన్ 2వ తేదీ నుంచి రైతు డిస్కం పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉందని రైతు డిస్కం సీఎండీ ముషారఫ్ ఫరూఖీ వెల్లడించారు.

# కవితా నీ నీచ రాజకీయాలు మానుకో..!

- **తెలంగాణ మాజీ కార్పొరేషన్ చైర్మన్ రాజా వరప్రసాద్**
- **టిఆర్ఎస్ అధినేత్రి కవితపై నిప్పులు చెరిగిన "రాజా వరప్రసాద్"**
- **రాజకీయ డ్రామాలు ఆపాలని హెచ్చరిక**
- **ఫామ్ హౌస్ కు తీసుకెళ్లి మత్తుమందు ఇచ్చి లైంగిక దాడి చేశాడంటే మధ్యలో నీ సన్నాయి నొక్కులు ఎందుకు..?**
- **సంఘటన వెలుగు చూసిన ఐదు రోజుల తర్వాత బయటకు వచ్చి టిఆర్ఎస్ పై విమర్శలు చేయడం ఒక కుట్ర**




**వికారాబాద్ బ్యూరో మే 13(ప్రజాక్షేత్రం):**
మైనర్ బాలికను ఫామ్ హౌస్ కు తీసుకెళ్లి కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ తీవ్రమైన లైంగిక దాడి చేశాడని సాక్షాత్తు బాధితురాలు ఆమె తల్లి ఆరోపిస్తుంటే.. సంఘటన వెలుగు చూసిన ఐదు రోజుల తర్వాత బయటికి వచ్చి కొత్తగా రాజకీయ డ్రామాలు చేస్తూ, మైనర్ బాలిక కుటుంబానికి అండగా నిలిచిన బిఆర్ఎస్ పార్టీనే కుట్రబుద్ధితో టార్గెట్ చేసి విమర్శలు చేయడం నీ నీచమైన రాజకీయానికి నిదర్శనమని రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ బిఆర్ఎస్ సీనియర్ నేత, తెలంగాణ మాజీ కార్పొరేషన్ చైర్మన్ రాజా వరప్రసాద్ నిప్పులు చెరిగారు. బుధవారం విడుదల చేసిన మీడియా ప్రకటనలో టిఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత పై ఘాటైన పదజాలాలు ప్రయోగించారు. టిఆర్ఎస్ పార్టీ పేరుతో రాజకీయాల్లోకి కొత్తగా అడుగుపెట్టి తన రాజకీయ స్వార్థం కోసం న్యాయంగా పోరాడుతున్న బిఆర్ఎస్ పార్టీపై విమర్శలు చేయడం అత్యంత నీచమైన చర్యగా ఆయన అభివర్ణించారు. కవిత మాట్లాడుతున్న మాటలను బట్టి చూస్తే బిఆర్ఎస్ పార్టీని టార్గెట్ చేయాలనే ఉద్దేశంతో విమర్శలు గుప్పిస్తున్నారని దీనివల్ల ఆమె ఎవరికి కొమ్ము కాస్తుందో అర్థమయిపోతుందని విమర్శించారు. తెలంగాణకు అమ్మలా అక్కలా ఉంటానని చెప్పిన కవిత ఇప్పుడు మైనర్ బాలికకు అన్యాయం జరిగిందంటే దానిపై మైనరో కాదు మేజరో అంటూ సన్నాయి నొక్కులు నొక్కడం సరికాదన్నారు. అమ్మాయి మైనర్ కాకపోతే మేజర్ అయితే ఆమెకు అన్యాయం జరగాలని కవిత కోరుకుంటున్నారా ప్రశ్నించారు. మహిళ అయితే ఫామ్ హౌస్ లోకి తీసుకెళ్లి మత్తు పదార్థాలు తాగించి లైంగిక వేధింపులకు గురి చేయవచ్చా..? కవిత ఇదే కోరుకుంటున్నారా..? అని పత్రికా ముఖంగా నిలదీశారు. కవిత నీచ రాజకీయాలు ఎవరికి ఉపయోగం లేవని పేర్కొన్నారు. ఒక మహిళ అయి ఉండి ఈ మాటలు మాట్లాడడానికి కొంచమైనా సిగ్గుపడాల్సిన అవసరం ఉందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్ పుత్రుడు అయితే బారాహుల్ మాఫీ ఉంటుందా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రికి చట్టాలు వర్తించవా అదే ఎవడో సామాన్యుడు ఈ దుర్మార్గం చేసి ఉంటే ఇలాగే కవిత సన్నాయి నొక్కులు నొక్కేవారా అని నిలదీశారు. ఒక అమ్మాయి తనకు ఫామ్ హౌస్ లోనికి తీసుకెళ్లి మత్తుమందు ఇచ్చి లైంగిక దాడి చేశాడని స్వయంగా బాధితురాలు చెబుతుంటే అదే విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేస్తే తాపీగా ఐదు రోజుల తర్వాత బయటకు వచ్చి దేశం మహిళలు అందరూ ఆ బండి భగీరథ ను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తుంటే ఇప్పుడు కవిత మాట్లాడే మాటలు చూస్తుంటే ఆమె అసలు రంగు తెలంగాణ ప్రజలకు అర్థం అవుతుందని తెలిపారు. కాంగ్రెస్ బిజెపి కలిసి కవితను బిఆర్ఎస్ పైన ఆరోపణలు చేయడానికి నిన్ను బయటికి తెచ్చి ఓ పార్టీ పెట్టించి విమర్శలు చేయిస్తున్నారని, నువ్వు ఒక అమ్ముడుపోయిన రాజకీయవేత్తవు, ఇక నీ డ్రామాలు తెలంగాణ ప్రజలు స్పష్టంగా తెలుసుకున్నారని రాజా వరప్రసాద్ విమర్శలు గుప్పించారు. ఇక టిఆర్ఎస్ మూసుకొని రేపిస్టుల బిజెపి పార్టీలో చెరిపోవాలి అంటూ రాజా వరప్రసాద్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. బిజెపి తీహార్ జైల్లో కవితకు చిప్పకూడు తినిపించిన ఇంకా బుద్ధి రాలేదంటూ రాజా వరప్రసాద్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మైనర్ బాలిక విషయంలో అండగా నిలబడాల్సిన కవిత ఆత్మవంచన చేసుకొని అన్యాయం చేయాలని చూడడం కన్నా వారణాసి వెళ్లి మోడీ జపం చేస్తూ గంగలో దూకాలని రాజా వరప్రసాద్ సలహా ఇచ్చారు..

## ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

- **గొట్లపల్లి తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాల ప్రిన్సిపాల్ పి.గాయత్రి**

**పెద్దేముల్, మే 13(ప్రజాక్షేత్రం):**
పెద్దేముల్ మండల పరిధిలోని గొట్లపల్లి గ్రామ సమీపంలో ఉన్న తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో 202627 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.గాయత్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి.గాయత్రి మాట్లాడుతూ... తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల గొట్లపల్లిలో 202627 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో MPC, BiPC, CEC, AEC (అకౌంటెన్సీ, ఎకనామిక్స్, కామర్స్) గ్రూపుల్లో అడ్మిషన్లు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు తమ SSC మార్కుల మెమో కాపీతోపాటు దరఖాస్తు ఫారాన్నికళాశాల కార్యాలయంలో సమర్పించాలని కోరారు. గొట్లపల్లి తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలలో 100% శాతం ఫలితాలు సాధించేలా ప్రత్యేక బోధన అందిస్తున్నామని,బాలికల కోసం ప్రత్యేకంగా హాస్టల్ సదుపాయం కల్పించామని పేర్కొన్నారు. అదనంగా విశాలమైన తరగతి గదులు, విశాలమైన ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, కంప్యూటర్స్, AI, ATL ల్యాబ్స్, విశాలమైన ఆధునిక లైబ్రరీ, స్పెషల్ క్లాసులు, IIT/JEE/NEET, కంప్యూటర్,సీఏ లలో ఉచిత శిక్షణ, ఫ్రీ ఆన్‌లైన్, ఫిజిక్స్‌వాలా మరియు ఖాన్ అకాడమీ తరగతులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతి రోజు స్పెషల్ క్లాసులు కూడా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా విద్యార్థుల క్రీడా ప్రోత్సాహం కోసం విశాలమైన ఆట స్థలం కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గ్రామీణ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నాణ్యమైన విద్యను అభ్యసించాలని ప్రిన్సిపాల్ పి.గాయత్రి కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 8106427639 ను సంప్రదించాలని కోరారు.




## పిల్లి వెంకటమ్మ మరణం గ్రామ పంచాయితీకి తీరని లోటు

- **- అనారోగ్యంతో పెద్దేముల్ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికురాలు పిల్లి వెంకటమ్మ మృతి**
- **గ్రామ పంచాయతీ తరపున రూ.10 వేల రూపాయల ఆర్థిక సాయం**
- **- రూ.10 వేల ఆర్థిక సాయాన్ని ఆమె కుటుంబ సభ్యులకు అందించిన సర్పంచ్ డివై నర్సింహులు, ఉపసర్పంచ్ డివై ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి లాలప్ప, కారోబార్ నర్సి రెడ్డి**
- **- పిల్లి వెంకటమ్మ మరణం చాలా బాధాకరం**

**పెద్దేముల్, మే 13(ప్రజాక్షేత్రం):**
వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికురాలు పిల్లి వెంకటమ్మ అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. ఆమె మృతితో పెద్దేముల్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతురాలు నిరుపేద కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న పెద్దేముల్ గ్రామ పంచాయతీ సర్పంచ్ డివై నర్సింహులు, ఉపసర్పంచ్ డివై ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి లాలప్ప, గ్రామ పంచాయతీ కారోబార్ పూరుగుర్తి నర్సి రెడ్డిలు మానవత్వంతో ముందుకు వచ్చి గ్రామ పంచాయతీ తరపున పిల్లి వెంకటమ్మ కుటుంబ సభ్యులకు రూ.10,000 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ డివై నర్సింహులు, ఉపసర్పంచ్ డివై ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి లాలప్ప, కారోబార్ పూరుగుర్తి నర్సిరెడ్డి తదితరులు మృతురాలు వెంకటమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గ్రామానికి సేవలందించిన పిల్లి వెంకటమ్మ మృతి చాలా బాధాకరమని, ఆమె కుటుంబానికి గ్రామ పంచాయతీ, తాము ఎల్లప్పుడు అండగా ఉంటామని పేర్కొన్నారు. మరోవైపు మృతురాలు పిల్లి వెంకటమ్మ అటు గ్రామంలో, ఇటు గ్రామ పంచాయతీ సిబ్బందితో కలివిడిగా ఉంటూ, పారిశుద్ధ్య కార్మికురాలిగా ఆయా కాలనీల ప్రజలు, గ్రామస్థులు, గ్రామస్థాయి అధికారులు చెప్పిన పనిని చెప్పినట్లు చేసి అందరి మన్ననలను పొందారు. అనారోగ్యంతో వెంకటమ్మ మృతి చెందడం పెద్దేముల్ గ్రామ పంచాయతీకి, గ్రామానికి తీరనిలోటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికుడు అంబరయ్య, గ్రామస్థులు పురుషప్ప, ఓగుల వెంకట్, మృతురాలు వెంకటమ్మ కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## మధరావుపల్లి లో వినోభా భావే – నెహ్రూ చరిత్ర కెక్కిన క్షణాలు గుర్తుగా విగ్రహాల ఏర్పాటు అవసరం

- **పలుస శంకర్ గౌడ్**



**వనపర్తి, మే 13(ప్రజాక్షేత్రం):**
మధరావుపల్లి గ్రామం చరిత్రలో ప్రత్యేక గుర్తింపు పొందింది. పానుగల్ మండలం మధరావుపల్లిని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ ఇతర సభ్యులు బుధవారం సందర్శించారు. ఈ గ్రామం 07 031956 నాటికి భూదాన్ ఉద్యమంలో వినోభా భావే పాదయాత్ర చేసిన స్థలంగా, అలాగే వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల భవన ప్రారంభోత్సవానికి భారత్ ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ వచ్చే సందర్భంలో చరిత్రాత్మక సమావేశాలకు మధ్య కేంద్రంగా నిలిచింది. ఇక్కడ భూదాన్ ఉద్యమం, భాషా సమస్యల చర్చలు, రాష్ట్రాల ఏర్పాట్లపై కీలక నిర్ణయాలు తీసుకున్న ఘనతలు నిమగ్నమయ్యాయి. భూదాన్ ఉద్యమం ద్వారా 44 లక్షల ఎకరాల భూములు పేదలకు పంపిణీ చేయబడిన సంగతి గుర్తించదగ్గది. పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ, "ఈ చరిత్రాత్మక గ్రామంలో వినోభా భావే, నెహ్రూ విగ్రహాలను ఏర్పాటు చేసి పార్క్ రూపంలో అభివృద్ధి చేయడం అత్యవసరం. భవిష్యత్తు తరాలకు చరిత్ర తెలిసేలా చూడాలి," అని అన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీ కళా వేదిక సభ్యులు ఉప్పరి తిరుమలేష్, భాస్కర్ మరియు స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు. మధరావుపల్లి, చరిత్ర పాఠాలుగా తరాల తరాలకు గుర్తుగా నిలిచేలా పరిరక్షించాల్సిన గ్రామం అని ఆయన తెలిపారు.

## నీట్ లీకేజీ బాధ్యుల పై కఠిన చర్యలు తీసుకోవాలి

- **ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ డిమాండ్**




**అమరచింత మే 13(ప్రజాక్షేత్రం):**
దేశవ్యాప్తంగా కోట్లాది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే నీ ట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనకు బాధ్యులైన ప్రభుత్వం కఠిన గశిక్షించాలని కుతుబ్ డిమాండ్ చేశారు.బుధవారం అమరచింతలో ఆయన మాట్లాడుతూ రాజస్థాన్లోని ప్రింటింగ్ ప్రెస్ నుండి పేపర్ లీకేజీ కావడం చూస్తుంటే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యార్థుల పట్ల ఎలాంటి చర్యలు తీసుకుంటుందో అర్థమవుతుందన్నారు. లీకేజీ వల్ల పరీక్ష రద్దు కావడంతో లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్ టి ఏ విద్యార్థుల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిందని విమర్శించారు. పేద మధ్యతరగతికి చెందిన విద్యార్థులు వాక్యంలో కష్టపడి పరీక్షలు రాస్తుంటే కొందరు మాత్రం లీకేజీ చేసి వందకు వంద మార్కులు కొట్టేయడం ఏమిటని ప్రశ్నించారు. పరీక్ష రద్దవడంతో పేద విద్యార్థులు మళ్లీ కోచింగ్ సెంటర్లకు వెళ్లి డబ్బులు ఖర్చు పెట్టాలని ఇది విద్యార్థుల కుటుంబాలకు తల్లిదండ్రులకు సాధ్యం కానీ పని అని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు చెలగాటమాడుతున్న పాలకుల వైఖరిని ఏఐవైఎఫ్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. పరీక్షలను అవినీతి కేంద్రాలుగా మార్చే విధానాలకు వ్యతిరేకంగా పరీక్షలను అవినీతి కేంద్రాలుగా మార్చే విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థి యువజన ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అనురాగ్ విజయ్ చేతన్ నవదీప్ పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలకు టాటా గ్లూకో ఎనర్జీ డ్రింక్ పంపిణీ

- **ఉపాధి హామీ కూలీల సంక్షేమమే మా లక్ష్యం**
- **- తింసాన్ పల్లి గ్రామ సర్పంచ్ గుడిసె చంద్రకళ శ్రీనివాస్, ఉపసర్పంచ్ ముకుంద శ్రీనివాస్**
- **సర్పంచ్ చంద్రకళ చొరవతో ఎస్సీ స్మశానవాటిక వద్ద సమస్య పరిష్కారం**

**పెద్దేముల్, మే 13(ప్రజాక్షేత్రం):**

ఉపాధిహామీ కూలీలు శరీరంలో నీటి శాతం తగ్గిపోకుండా, మండుతున్న ఎండల దృష్ట్యా జాగ్రత్తలు తీసుకుంటూ పనులు చేసుకోవాలని తింసాన్ పల్లి గ్రామ సర్పంచ్ గుడిసె చంద్రకళ శ్రీనివాస్, ఉపసర్పంచ్ ముకుంద శ్రీనివాస్ లు సూచించారు. బుధవారం పెద్దేముల్ మండల పరిధిలోని తింసాన్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని గ్రామ సర్పంచ్ గుడిసె చంద్రకళ శ్రీనివాస్, ఉపసర్పంచ్ ముకుంద శ్రీనివాస్ లు ఉపాధి హామీ కూలీలకు టాటా గ్లూకో ఎనర్జీ డ్రింక్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గుడిసె చంద్రకళ శ్రీనివాస్, ఉపసర్పంచ్ ముకుంద శ్రీనివాస్ లు మాట్లాడుతూ మండుతున్న ఎండల్లో కష్టపడి పనిచేస్తున్న కూలీల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. వేసవి కాలంలో శరీరంలో నీటి శాతం తగ్గిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కూలీలు తగినంత నీరు, శీతల పానీయాలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ కూలీల సంక్షేమమే తమ లక్ష్యమని, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు.

**ఎస్సీ స్మశానవాటిక సమస్య వద్ద పరిష్కారం**

తింసాన్ పల్లి గ్రామంలోని ఎస్సీ స్మశానవాటిక వద్ద చాలాకాలంగా ప్రమాదకరంగా ఉన్న కాలువను గ్రామ సర్పంచ్ గుడిసె చంద్రకళ జేసీబీ సహాయంతో పూడ్చివేయించరు. ఆ



పనులను స్వయంగా ఆమెనే పర్యవేక్షించారు. ముఖ్యంగా ఎస్సీ స్మశాన వాటికకు అంత్యక్రియల కోసం వచ్చేవారికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముకుంద శ్రీనివాస్, గ్రామ వార్డు సభ్యుడు ఉలేందర్ రెడ్డి, తింసాన్ పల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ తాజా మాజీ అధ్యక్షుడు హానీఫ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుద్ధారం నాగేష్, పల్లె రవి, శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణ, ఉపాధి హామీ కూలీలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ఘోర రోడ్డు ప్రమాదం

- **క్షతగాత్రులను పరామర్శించిన దేవరకద్ర ఎమ్మెల్యే జియంఆర్**

**మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి మే 13(ప్రజాక్షేత్రం):**

చిన్న చింతకుంట మండలం దమగ్నాపూర్ గ్రామస్తులు భూత్పూర్ మండలం పాత మొల్గర గ్రామంలో ఓ వివాహానికి హాజరై తిరుగు ప్రయాణంలో వారి బోలెరో వాహనం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో బోల్తా పడడంతో..వాహనంలో ఉన్న ప్రయాణికులు తీవ్ర గాయాల పాలైన విషయాన్ని తెలుసుకుని, స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ డిప్యూటీ మేయర్ యం. సురేందర్ రెడ్డి గారు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ తదితర నాయకులతో కలసి మహబూబ్ నగర్ జిల్లా ఆస్పత్రికి చేరుకుని, వైద్యులు, హాస్పిటల్ సూపరింటెండెంట్ తో కలిసి క్షతగాత్రులు పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఈ ప్రమాదంలో 7 ఏళ్ల చిన్నారి మండ్ల నాగరాజ్ కుమారుడు సాయి హర్షిత్ మృతిచెందగా, మరో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉంది, తీవ్రగాయాల పాలైన మరో ఇద్దరిని నారాయణ గౌడ్, కొండన్న గార్లను నిమ్స్ ఆస్పత్రికి తరలించారు, ఈ సందర్భంగా నిమ్స్ ఆస్పత్రి వైద్యులతో ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.



## ఉపాధిహామీ కూలీలకు ఈకేవైసీపై అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఓ జమలారెడ్డి

**బూర్గంపాడు మే 13(ప్రజాక్షేత్రం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలంలో ఉపాధిహామీ జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని ఎంపిడిఓ జమలా రెడ్డి సూచించారు. ఈకేవైసీ చేయించుకోని వారి పేర్లు జాబ్ కార్డుల నుంచి తొలగించే అవకాశం ఉందని గ్రామాల్లో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. బుధవారం ఉదయం బూర్గంపహాడ్ గ్రామ పంచాయతీలో స్వయంగా ఉపాధిహామీ కూలీలకు ఎంపిడిఓ జమలారెడ్డి ఈకేవైసీ నిర్వహించారు. జాబ్ కార్డు ఉన్న అసలైన వ్యక్తులే పనులకు హాజరయ్యేలా చూడటానికి ఆధార్‌తో అనుసంధానం చేస్తూ ఈకేవైసీ సేకరిస్తున్నామని తెలిపారు. ఉపాధిహామీ కూలీలు తమ సమీప గ్రామ పంచాయతీ కార్యాలయం లేదా ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా వెంటనే ఈకేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని కోరారు. ఇందుకోసం ఫేషియల్ రికగ్నిషన్ (Facial Recognition) యాప్‌ను ఉపయోగిస్తున్నట్లు వివరించారు.కొత్త నిబంధనల ప్రకారం ఈకేవైసీ పూర్తి చేయని కూలీలకు పనులు చేసినప్పటికీ వేతనాలు నిలిచిపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. అందువల్ల ప్రతి కూలీ తప్పనిసరిగా ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మందా నాగరాజు, ఉపాధిహామీ టీఏలు, మేట్లు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





## పెద్దమ్మ తల్లికి విరాహాలు డాక్టర్ బంగ్లా లక్ష్యం కాంత్ రెడ్డి

**ఆత్మకూర్ మే 13(ప్రజాక్షేత్రం):**

ఆత్మకూరులో పెద్దమ్మ తల్లి విగ్రహావిష్కరణలో భాగంగా పెద్దమ్మ తల్లి ఆలయానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి శ్రీ భువనేశ్వరి పీఠాధిశ్వరులు శ్రీ శ్రీ కమలానంద భారతి స్వామీజీ చేతుల మీదగా పెద్దమ్మ తల్లి ఆలయానికి లక్ష రూపాయలు ఇవ్వడం జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్ గౌడ్ భాజపా మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ అశ్విన్ కుమార్ జిందే జ్యోతి శ్రీనివాసులు కౌన్సిలర్ కే ఆనంద్ సురేష్ కొండాపురం రాము శివశంకర్ విష్ణువర్ధన్ రెడ్డి మరియు పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ తరపున బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు

## జూన్2 లోపు జ్యుడిషియల్ కమిషన్ వేయాలని డిమాండ్

- **TUJAC రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్**

**వలిగొండ మే 13(ప్రజాక్షేత్రం):**



తెలంగాణ రాష్ట్రం అనేక పోరాటాలు బలిదానాలు త్యాగాల ఫలితంగా సాధ్యమైందని ఉద్యమకారుల త్యాగాలు లేకుండా నేడు కొందరు అనుభవిస్తున్న భోగాలు పదవులు సాధ్యమయ్యేవి కావని మలిదశ ఉద్యమకారుడు TUJAC రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టోఫర్ అన్నారు. బుధవారం రోజు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ త్యాగాలు చేయని వారికి పదవులు ఎలా దక్కాయో ఆలోచించాలని ఆయన అన్నారు. ఉద్యమకారుల త్యాగాల పునాదుల మీద ఏర్పడిన రాష్ట్రంలో నేడు అనేక మంది ఉద్యమకారులు కనీసం జీవన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొనడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం కోసం పోరాడిన వారికి తగిన గుర్తింపు గౌరవం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జూన్ 2 లోపు ఉద్యమకారులను గుర్తించేందుకు జ్యూడిషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఏర్పాటుకు ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల త్యాగాలను గౌరవిస్తూ వారికి తగిన ప్రాధాన్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన అన్నారు.

## నర్సింగ్ కాలేజ్ భవనానికి శంకుస్థాపన

**వలిగొండ మే 13(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా ముత్తిరెడ్డి గూడెంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ముఖ్యంగా వైద్య విద్యను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పేద మరియు మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణం పూర్తయితే స్థానిక యువతకు ఉన్నత విద్యతో పాటు ఉపాధి అవకాశాలు కూడా విస్తృతంగా లభిస్తాయని పేర్కొన్నారు. వైద్య రంగంలో నైపుణ్యం కలిగిన సిబ్బందిని తయారు చేయడంలో ఈ కళాశాల కీలక పాత్ర పోషిస్తుందని, భవిష్యత్‌లో భువనగిరి ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇది దోహదపడుతుందని అన్నారు. భువనగిరి ప్రాంత అభివృద్ధిలో విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్, భువనగిరి మున్సిపల్ ఛైర్పర్సన్, వైస్ ఛైర్పర్సన్ పట్టణ మండల, గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు అధికారులు పాల్గొన్నారు.



## నీట్ నిర్వహణ లో విఫలమైన నిట్ ను రద్దు చేయాలి

- **ఎన్ ఎస్ యూ ఐ మండల బాధ్యుడు మహమ్మద్ సమీరుద్దీన్**

**చేవెళ్ల మే 13(ప్రజాక్షేత్రం):**




ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల కొరకు నిర్వహించే నీట్ పరీక్ష నిర్వహించడంలో విఫలమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ని రద్దు పర్చాలని నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా చేవెళ్ళ మండల కమిటీ సభ్యుడు సమీరు డిమాండ్ చేశారు. బుధవారం వారు ఓ ప్రకటనలో తెలుపుతూ.. ఈ నెల 3వ తేదిన దేశవ్యాప్తంగా జరిగిన నీట్ 2026 పరీక్షను రద్దు చేయడం పట్ల మండిపడ్డారు. పకడ్బంధీగా నిర్వహించాల్సిన పరీక్ష పేపర్ లీక్ కావడం పూర్తిగా నీట్ వైఫల్యమేనని తెలిపారు. వెంటనే ఏజెన్సీ ని రద్దు పర్చాలని డిమాండ్ చేశారు. రాత్రనక పగలనక ఎంతో శ్రమించి పరీక్ష రాస్తే తీరా అట్టి పరీక్ష ను రద్దు చేసి తిరిగి ఎగ్జామ్ నిర్వహించడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని వివరించారు. నీట్ రద్దుతో 22 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటమేనని దుయ్యబట్టారు. విద్యార్థులకు న్యాయం చేకూరేలా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిచో ఎన్ ఎస్ యూ ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

## గ్రామ గ్రామాన ఇందిరమ్మ ఇండ్ల జాతర..

- **కాంగ్రెస్ జెండా ఆవిష్కరణ రెపరెపలు**
- **సంక్షేమ పథకాలతో ప్రజల్లోకి కాంగ్రెస్..**
- **గృహప్రవేశాలకు హాజరైన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**వనపర్తి, మే 13(ప్రజాక్షేత్రం):**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో గ్రామ గ్రామాన పార్టీ మరింత బలోపేతం అవుతోందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి పట్టణంలోని 12వ వార్డులో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాలకు ఆయన హాజరై నూతన వస్త్రాలు అందించి అభినందించారు. తమ సొంతింటి కల నెరవేరడంపై లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అరుణచింతకాయల మన్నెం, చామంతిరవి, నక్క వెంకటయ్యకుసుమ, ఆగారపు శ్యాంకుమార్‌జ్యోతి, వడ్డగేరి అలివేల కుటుంబాల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నిరుపేద కుటుంబం సొంత ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. గత ప్రభుత్వాలు కేవలం హామీలకే పరిమితమై ప్రజా సంక్షేమాన్ని విస్మరించాయని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యంలో గ్రామ గ్రామాన సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరుతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వంతోనే నిజమైన ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అనంతరం పట్టణ పరిధిలోని రాజనగర్‌లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల కారణంగా ప్రజల్లో పార్టీపై విశ్వాసం పెరుగుతోందన్నారు. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగరేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ బి శ్రీనివాస్ గౌడ్, స్థానిక కౌన్సిలర్ నక్క రాణి రాజు, పట్టణ కౌన్సిలర్స్ బ్రహ్మంచారి, పాకనాటి కృష్ణయ్య, శరవంద, పితాంబరం, క్రాంతి గౌడ్, ఎస్ ఎల్ ఎన్ రమేష్, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## పెద్దమ్మతల్లి ఆలయ అభివృద్ధికై ఒక లక్ష ముప్పై వేలను అందించిన టి.జె.విశ్వేశ్వర్

**ఆత్మకూర్ మే 13(ప్రజాక్షేత్రం):**

వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలోనీ శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా ఆలయ అభివృద్ధికై,ప్రముఖ సామాజిక సేవకులు, సహృదయులు, నిరాడంబరులు, శ్రీ వాణి హై స్కూల్ అడ్వైజర్ టి.జె.విశ్వేశ్వర్ ఒక లక్ష ముప్పై వేయిల రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా కుటుంబంపై ఆ పెద్దమ్మ తల్లి ఆశీస్సులు ఉండాలని, ఆలయ కమిటీ సభ్యులు ఆ పెద్దమ్మ తల్లిని ప్రార్థించారు.



## మహిళా కానిస్టేబుల్‌ను ప్రేమ పేరుతో మోసం చేసిన ఎస్సై సస్పెండ్!

- **పరారీలో ఎస్సై**

**కూకట్‌పల్లి మే 13(ప్రజాక్షేత్రం):**



పెళ్లి చేసుకుంటానని నమ్మించి తోటి మహిళా కానిస్టేబుల్‌ను మోసం చేసిన సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) సురేష్ కుమార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. 2018 బ్యాచ్‌కు చెందిన సురేష్ కుమార్ ప్రస్తుతం కొల్లూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధుల్లో ఉన్నాడు. ఈ క్రమంలో కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ లేడీ కానిస్టేబుల్‌తో అతనికి పరిచయం ఏర్పడి, అది కాస్తా ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించడంతో సదరు యువతి అతనికి మరింత దగ్గరైంది. అయితే కొన్నాళ్ల తర్వాత పెళ్లి విషయంపై ఆమె ఒత్తిడి తీసుకురాగా.. ఎస్సై సురేష్ ఏవో సాకులు చెప్తూ తప్పించుకోవడం ప్రారంభించాడు. ఈ విషయమై ఇటీవల ఇద్దరి మధ్య తీవ్రమైన గొడవ కూడా జరిగింది. తనను మోసం చేసేందుకే సురేష్ ప్రయత్నిస్తున్నాడని గ్రహించిన మహిళా కానిస్టేబుల్ అతడిని గట్టిగా నిలదీయడంతో, అతను ఆమెపైనే ఎదురుతిరిగి పెళ్లి చేసుకోవడం కుదరదని తేల్చి చెప్పాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాధితురాలు కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ కోసం పోలీసులు సురేష్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించగా, అతను తన మొబైల్ ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి పరారయ్యాడు. ఈ నేపథ్యంలో బాధితురాలు సమర్పించిన ప్రాథమిక ఆధారాలను పరిశీలించిన ఉన్నతాధికారులు, విధుల్లో నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన ఎస్సై సురేష్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# భార్య కాళ్లు నరికిన కిరాతక భర్త!

**చౌటకూర్ మే 13(ప్రజాక్షేత్రం):**



సంగారెడ్డి జిల్లాలో కుటుంబ కలహాలు దారుణానికి దారితీశాయి. భార్యాభర్తల మధ్య తలెత్తిన మనస్పర్థల కారణంగా ఓ భర్త తన భార్య కాళ్లను గొడ్డలితో నరికిన కిరాతక ఘటన చౌటకూర్ మండలం గంగోజిపేట్‌లో చోటుచేసుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. కిరాతకంగా గొడ్డలితో దాడి పోలీసుల కథనం ప్రకారం.. గంగోజిపేట్‌కు చెందిన కుమ్మరి దుర్గయ్య, వీరామణి (45) దంపతుల మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆగ్రహానికి లోనైన దుర్గయ్య, ఇంట్లోని గొడ్డలిని తీసుకుని భార్య వీరామణి కాళ్లపై తీవ్రంగా దాడి చేశాడు. ఈ దాడిలో ఆమె కాళ్లు తెగిపోయి రక్తమోడటంతో పరిస్థితి విషమంగా మారింది. బాధితురాలిని వెంటనే హైదరాబాద్‌లోని అమీర్‌పేట వెల్నెస్ హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె అక్కడ ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతోంది.

**తండ్రిపై ఫిర్యాదు చేసిన కొడుకు**

ఈ దారుణ ఘటన తన కళ్ల ముందే జరగడంతో బాధితురాలి కుమారుడు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాడు. తన తల్లిని కిరాతకంగా గాయపరిచిన తండ్రి దుర్గయ్యపై కుమారుడు పుల్కల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కొడుకు ఇచ్చిన ఫిర్యాదుతోనే ఈ దారుణం బయట ప్రపంచానికి తెలిసింది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, నిందితుడు దుర్గయ్యపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై లోతైన దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# బండి భగీరథ్ కనిపించడం లేదు.. హైదరాబాద్‌లో వెలసిన పోస్టర్లు!

**హైదరాబాద్ మే 13(ప్రజాక్షేత్రం):**

పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్ కనిపించడం లేదని హైదరాబాద్‌లో పోస్టర్లు వెలిశాయి. శేరిలింగంపల్లి, గచ్చిబౌలి సహా అనేక ప్రాంతాల్లో బుధవారం ఉదయం ఈ పోస్టర్లు కలకలం సృష్టించాయి. బండి భగీరథ్ ఆచూకీ తెలిస్తే పోలీస్ స్టేషన్‌లో చెప్పండి అంటూ మెట్రో పిల్లర్లు, బస్టాప్‌లు, ప్రధాన కూడళ్లలో పలువురు ఈ పోస్టర్లను అతికించారు. మరోవైపు పలువురు సామాజికవేత్తలు సైతం బండి భగీరథ్ కనిపించడం లేదంటూ హైదరాబాద్ మెట్రోలో ప్రచారం చేశారు. మీకు ఎవరికైనా కనిపిస్తే డయల్ 100కు కాల్ చేసి సమాచారం చెప్పండి అంటూ విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉంటే ముందు నుంచి బండి సంజయ్ కుమారుడిని రక్షించేందుకు తాపత్రాయపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పోస్టర్లను వెంటవెంటనే చించేస్తోంది. దీనికి సంబంధించిన వీడియోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

**బండి సంజయ్ కొడుకుపై సెక్షన్లను సవరించిన పోలీసులు**

బండి సంజయ్ కుమారుడిపై తాజాగా కొన్ని సెక్షన్లను అదనంగా చేర్చారు. పోక్సో చట్టం సెక్షన్ 5(1) రెడ్ విత్ 6ను జత చేశారు. ఇంతకుముందు బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు సెక్షన్ 11 రెడ్ విత్ 12 ఆఫ్ పోక్సో చట్టం, బీఎన్ఎస్ 74, 75 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇదివరకు లైంగిక వేధింపులుగా భావించిన పోలీసులు ఇప్పుడు సెక్షన్లను మార్చడం కేసు తీవ్రత మరింత పెరిగి, చట్టం నుంచి భగీరథ్ తప్పించుకోలేని స్థితికి వచ్చాడు. పోలీసులు తాజాగా జతచేసిన సెక్షన్ల ప్రకారం నేరం రుజువైతే.. నిందితుడికి 20 ఏండ్లకు తగ్గకుండా జైలు శిక్ష లేదా జీవిత ఖైదు విధించే అవకాశాలున్నాయి. కేసు మరింత తీవ్రంగా ఉండేపక్షంలో మరణశిక్ష కూడా పడవచ్చని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసు దర్యాప్తును మహిళా ఐపీఎస్ అధికారి రితిరాజ్‌కు అప్పగించిన నేపథ్యంలో వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసు దర్యాప్తును మరింత ముమ్మరం చేసిన పోలీసులు భగీరథ్‌ను బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు విచారణకు హాజరు కావాలని కరీంనగర్‌లో అతని బంధువులకు నోటీసులు అందించారు.

**తొలుత కేసును నీరుగార్చే యత్నం**

ఈ నెల 8న బాధితురాలైన మైనర్‌పై లైంగిక వేధింపులు జరిగాయంటూ ఆమె తల్లి పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడానికి వెళ్లినప్పుడు.. పోలీసులు హైడ్రామా మధ్య సెక్షన్ 74, 75 అఫ్ బీఎన్ఎస్, సెక్షన్ 11 రెడ్ విత్ 12 ఆఫ్ పోక్సో యాక్ట్ 2012 మేరకు కేసులు నమోదు చేశారు. ఆ తరువాత బాధితురాలి నుంచి మహిళా అధికారులు వాంగ్మూలం తీసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు బాధితురాలు నిజం చెప్పకుండా ఉండేలా ఒత్తిళ్లు తెచ్చారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో అన్నివైపుల నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగడంతో.. ప్రభుత్వం సోమవారం కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్‌ను ప్రత్యేక దర్యాప్తు అధికారిగా నియమించింది. వెంటనే దర్యాప్తును చేపట్టిన రితిరాజ్ సోమవారం సాయంత్రం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఘటన గురించి ఆరా తీశారు. అప్పటికే పోలీసులు బాధితురాలి నుంచి తీసుకున్న వాంగూల్మాన్ని పరిశీలించారు. అందులో స్పష్టత లేకపోవడంతో మరింత లోతుగా దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం నేరుగా బాధితురాలిని కలిసి జరిగిన విషయం తెలుసుకున్నారు. పోక్సో కేసు దర్యాప్తులో మహిళా అధికారులు ఫ్రెండ్లీ వాతావరణంలో బాధితురాలి నుంచి జరిగిన ఘటనకు సంబంధించిన అంశాలను సేకరించాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే రితిరాజ్ నేరుగా బాధితురాలి ఇంటికి వెళ్లి ఆమెతో చాలాసేపు మాట్లాడినట్టు తెలిసింది. బాధితురాలు చెప్పిన విషయాలకు పోలీసులు కేసు నమోదు చేసిన సెక్షన్లకు పొంతన లేని విషయాన్ని ఆమె గుర్తించారు. బాధితురాలు చేసిన ఆరోపణలు పోక్సో చట్టంలోని సెక్షన్ 5(1), 6ల పరిధిలోకి వస్తాయి. బాధితురాలిపై పలుమార్లు లైంగికదాడి జరిగినట్టు ఆరోపణలుంటే ఈ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని చట్టం సూచిస్తున్నది.

**తీవ్రమైన సెక్షన్ల జోడింపు**

బాధితురాలు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా జరిగిన నేరం అత్యంత తీవ్రమైనదని గ్రహించిన డీసీపీ ఆ మేరకు కేసులో సెక్షన్లను అలర్ట్ చేయించారు. పోక్సో చట్టంలోని సెక్షన్ 5(1) రెడ్ విత్ 6ను జోడించారు. దీంతో ఇప్పటివరకు లైంగికదాడికి యత్నంగా భావిస్తూ వస్తున్న ఈ కేసులో బలాత్కారం జరిగినట్టు నిర్ధారణ అవుతున్నది. కొత్తగా అలర్ట్ చేసిన సెక్షన్లతో పోలీసులు మంగళవారం భగీరథ్‌కు నోటీసులు జారీచేశారు. దర్యాప్తు బృందం నోటీసులు ఇవ్వడానికి కరీంనగర్ వెళ్లినప్పుడు.. అక్కడ భగీరథ్ లేకపోవడంతో అతడి మేనమామ డాక్టర్ వంశీకృష్ణకు అందజేశారు. బండి సాయిభగీరథ్‌పై పేట్‌బషీరాబాద్‌లో నమోదైన 684/2026 కేసులో నిందితుడిగా ఉన్నాడని, అతనిపై పోక్సో కేసు నమోదైందని, పలు అభియోగాలున్నాయని నోటీసులో పేర్కొన్నారు. ఈ మేరకు 13వ తేదీ మధ్యాహ్నం బండి సాయిభగీరథ్‌ను విచారణకు తీసుకొని రావాలంటూ ఆయనకు సూచన చేశారు. ఇదిలాఉండగా భగీరథ్ ఫోన్ స్విచాఫ్‌లో ఉందని పోలీసులు గుర్తించారు.




# రోజుకు రూ.2 వేలు... హైదరాబాద్ జైల్లో ఒక రోజు ఖైదీగా గడిపే చాన్స్!

- హైదరాబాద్ చంచల్‌గూడ జైలులో 'ఫీల్ ది జైల్' కార్యక్రమం ప్రారంభం
- ఫీజు చెల్లించి 12 లేదా 24 గంటలు జైలులో గడిపే అవకాశం
- ఖైదీల జీవనశైలి, స్వేచ్ఛ విలువపై అవగాహన కల్పించడమే లక్ష్యం
- జైలు పరిణామ క్రమాన్ని తెలిపేలా కొత్తగా జైల్ మ్యూజియం ఏర్పాటు
- ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

**హైదరాబాద్ మే 13(ప్రజాక్షేత్రం)**

హైదరాబాద్‌లోని చంచల్‌గూడ సెంట్రల్ జైలులో అధికారులు ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'ఫీల్ ది జైల్' పేరుతో ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా సాధారణ పౌరులు కూడా జైలు జీవితాన్ని ప్రత్యక్షంగా అనుభవించే అవకాశం కల్పిస్తున్నారు. ఖైదీల జీవనశైలి, వారు ఎదుర్కొనే పరిస్థితులు, స్వేచ్ఛ విలువ గురించి ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమంలో భాగంగా 24 గంటల పాటు జైలులో గడపాలనుకునే వారు రూ. 2,000 చెల్లించాల్సి ఉంటుంది. 12 గంటల అనుభవం కోసం రూ. 1,000 ఫీజుగా నిర్ణయించారు. ఇందులో పాల్గొన్న వారికి ప్రత్యేకంగా రూపొందించిన జైలు గదులలో బస కల్పిస్తారు. ఖైదీలకు ఇచ్చే భోజనం అందించి, జైలు నిబంధనలు, ఖైదీల దినచర్యను పాటింపజేస్తారు. మంగళవారం చంచల్‌గూడలోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్ (ఎస్ఐసీఏ) ప్రాంగణంలో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. దీంతో పాటే కొత్తగా ఏర్పాటు చేసిన జైల్ మ్యూజియంను కూడా ఆయన ప్రారంభించడం విశేషం. ఈ మ్యూజియంలో నిజాం కాలం నాటి జైళ్ల నుంచి ఆధునిక సంస్కరణ కేంద్రాల వరకు జరిగిన మార్పులను ప్రదర్శనకు ఉంచారు. పాతకాలపు సంకెళ్లు, జైలు గదులతో పాటు భక్త రామదాసు, దాశరథి కృష్ణమాచార్యులు వంటి ప్రముఖులు జైలు జీవితం గడిపిన వివరాలను పొందుపరిచారు. అంతేగాక నాగార్జున సాగర్ డ్యామ్ నిర్మాణంలో ఖైదీల పాత్ర వంటి ఆసక్తికరమైన అంశాలను ఈ మ్యూజియంలో చూడవచ్చు. ఈ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. "జైళ్లను కేవలం శిక్షా కేంద్రాలుగా కాకుండా, సంస్కరణ, పరివర్తన కేంద్రాలుగా చూడాలి. నేరస్థులకు శిక్షతో పాటు పునరావాసం, రెండో అవకాశం కల్పించడంపై ఒక ప్రగతిశీల సమాజం దృష్టి సారించాలి" అని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం రాష్ట్ర సంస్కరణ చర్యలలో ఒక కొత్త అధ్యాయమని, దీనివల్ల జైళ్ల పరిపాలన, ఖైదీల పునరావాసంపై ప్రజలకు మెరుగైన అవగాహన కలుగుతుందని జైళ్ల శాఖ డీజీపీ సౌమ్య మిశ్రా తెలిపారు. గతంలో సంగారెడ్డి హెరిటేజ్ జైలు మ్యూజియంలో ప్రారంభించిన 'ఒక రోజు జైలు అనుభవం' కార్యక్రమం నుంచి స్ఫూర్తి పొంది, మరింత వ్యవస్థీకృతంగా చంచల్‌గూడలో ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవ్వగా, డబ్బులు చెల్లించి ఖైదీగా ఒక్కరోజు గడపాలన్న ఆలోచనపై నెటిజన్లు ఆసక్తిగా స్పందిస్తున్నారు.









# ఎస్సీ, ఎస్టీ కోర్టు సంచలన తీర్పు

- కులం పేరుతో దూషించినందుకు పదకొండేళ్లు జైలుశిక్ష

**నల్గొండ జిల్లా ప్రతినిధి మే 13(ప్రజాక్షేత్రం):**




తప్పు చేస్తే కాలం వెంటాడు తుందనడానికి నల్గొండ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు వెలువరించిన తీర్పు నిదర్శనంగా నిలుస్తుందని నిరూపిస్తూ 13 ఏళ్ల క్రితం నాటి ఓ అమానుష ఘటనపై నల్గొండ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక సెషన్స్ మంగళవారం సంచలన తీర్పునిచ్చింది. ప్రేమ పేరుతో వంచించి కులం పేరుతో దూషించిన నిందితులకు కోర్టు కఠినకారాగార శిక్షలను ఖరారు చేసింది.

**కేసు పూర్వాపరాలు**

కోర్టు తీర్పు అనుగుణంగా నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడించిన పూర్వపురాలు ఇలా ఉన్నాయి. 2013లో చందంపేట మండలం గన్నేరులపల్లికి చెందిన నక్క పర్వతాలు దిండి మండలం చెందిన యువతీని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. తీరా బాధితురాలు పెళ్లి ప్రస్తావన వచ్చేసరికి పర్వతాలు మరియు అతని అత్త నీలం సత్తమ్మ కలిసి ఆమె కులాన్ని కించపరుస్తూ తీవ్రంగా దూషించి పెళ్లికి నిరాకరించారు.

**నిందితులకు కఠిన శిక్షలు**

సుదీర్ఘ విచారణ అనంతరం కోర్టు నిందితులకు భారీ శిక్షలను విధించింది. నిందితుడు నక్క పర్వతాలకు వేరువేరు సెక్షన్ల కింద కలిపి మొత్తం 11 ఏళ్లు జైలు శిక్షతోపాటు ఐదు వేల జరిమానా విధించబడింది. అదే సమయంలో నిందితురాలు నీలం సత్తమ్మకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు 3000 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో రెండు నెలలు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. అయితే కోర్టు ఆదేశాల ప్రకారం ఈ శిక్షలని ఏకకాలంలో అమలు కానున్నాయి.

**అధికారులకు అభినందనలు**

ఇదిలా ఉండగా బాధితురాలుకి న్యాయం చేకూర్చడంలో కీలకపాత్ర పోషించిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నరసింహతో పాటు దర్యాప్తులో అప్పటి ఎస్సై రామాంజనేయులు, మాజీ దేవరకొండ ఎస్ డి పి ఓ మనోహర్, హెడ్ కానిస్టేబుల్ కృష్ణన్, కానిస్టేబుల్ లింగయ్య బాధితులకు భరోసా ఇచ్చేలా నేరస్థుల్లో వణుకు పుట్టించేలా ఈ తీర్పు ఉంది. సాక్ష్యాధారాలను పకడ్బందీగా సమర్పించిన ప్రతి అధికారికి ఎస్పీ శరత్చంద్ర పవర్ తెలిపారు. ప్రస్తుతం డిండి పోలీస్ స్టేషన్లో బాధ్యతలను ఎస్సై బాలకృష్ణ, సిఐ బీసన్న దేవరకొండ ఎస్ డి పి ఓ శ్రీనివాస్ పర్యవేక్షిస్తున్న వారికి కూడా అభినందనలు తెలిపారు. కాగా కాలం గడిచిన న్యాయం గెలుస్తుందని బలహీన వర్గాలపై వేధింపులకు పాల్పడితే శిక్షలు తప్పవని ఈ తీర్పు మరోసారి స్పష్టం చేసిందని పేర్కొన్నారు.

# మంత్రి అడ్లూరికి తృటిలో తప్పిన ప్రమాదం

**కరీంనగర్ మే 13(ప్రజాక్షేత్రం):**

రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగిని పరామర్శించేందుకు వెళ్లిన సమయంలో లిఫ్ట్ వైర్ తెగింది. సంఘటన సమయంలో మంత్రి లిఫ్ట్ లో ఉన్నాడు. ఈ ఘటన కరీంనగర్ లో బుధవారం చోటుచేసుకుంది. ఆసుపత్రిలో పై అంతస్తుకు వెళ్లేందుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్, అతని సహచరులు, సెక్యూరిటి సిబ్బంది లిఫ్ట్ ఎక్కారు. లిఫ్ట్ మధ్యలోనే ఒక్కసారిగా ఆగిపోయింది. ఆతర్వాత లిఫ్ట్ వైర్ తెగిపోవడంతో లిఫ్ట్ ఒక్కసారిగా కిందకు పడిపోయింది. ఈ ఘటనలో మంత్రి కి స్వల్ప గాయలైనాయి. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది వెంటనే లిఫ్ట్ తలుపులు తెరిచి మంత్రిని క్షేమంగా బయటకు తీసుకొచ్చారు.



# వేసవి సెలవులు ఇవ్వని కార్పొరేట్ ప్రైవేట్ జూనియర్ కళాశాలల పై తక్షణమే చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి లతీఫ్

**ఆళ్లగడ్డ మే 13(ప్రజాక్షేత్రం):**



విద్యార్థులతో నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ జూనియర్ కళాశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి లతీఫ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆళ్లగడ్డ పట్టణంలో ప్రస్తుతం 41 నుండి 43 డిగ్రీల వరకు తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి తరగతులు నిర్వహించడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఆళ్లగడ్డ ప్రాంతాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించడం, రెండో సంవత్సరం పూర్తయిన విద్యార్థులకు ఈఏపిసెట్ (ఎంసెట్)పేరుతో ప్రత్యేక తరగతులు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. ఇంటర్ బోర్డు మార్గదర్శకా లను ఉల్లంఘిస్తూ నిర్వహిస్తున్న ఈ తరగతులు విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపడమేకాకుండా వారి ఆరోగ్యానికి ప్రమాదకరమ ని హెచ్చరించారు. ఇంటర్ జూనియర్ కళాశాలలకు ఏప్రిల్ 24 నుండి జూన్ 1 వరకు సెలవులు మంజూరు చేసినట్లు ఇంటర్ బోర్డు స్పష్టం చేసినప్పటికీ అవి పట్టించుకోకపోవడం, జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్టు వ్యాహరించడం విడ్డురంగా ఉందన్నారు. దీనివల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మరుగున పడే అవకాశం ఉందన్నారు.

# కొమురవెల్లిలో ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ప్రత్యేక పూజలు

**హైదరాబాద్ మే 13(ప్రజాక్షేత్రం):**

జూబ్లీహిల్స్ కాంగ్రెస్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవీన్ యాదవ్ స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజల శాంతి, సౌభాగ్యం, అభివృద్ధి కోసం ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మాధవి మల్లికార్జున్, ఏఈఓ బుద్ధి శ్రీనివాస్‌తో పాటు ఇతర ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

**ఆలయ అభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ కొమురవెల్లి మల్లికార్జున స్వామి తమ ఇంటి దైవం, కులదైవమని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రసిద్ధి చెందిన ఈ ఆలయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. గతంలో ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ ద్వారా అభివృద్ధి చేయాలని నిర్ణయించిన తొమ్మిది దేవాలయాల జాబితాలో కొమురవెల్లి ఆలయాన్ని కూడా చేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరతానని తెలిపారు. దీనికి సంబంధించి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

**అతిథి గృహ నిర్మాణంపై హామీ**

దేవాలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయం సమీపంలో ప్రభుత్వ తరఫున అతిథి గృహం నిర్మించేందుకు కూడా కృషి చేస్తానని ఎమ్మెల్యే నవీన్ యాదవ్ వెల్లడించారు. కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాలపై ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.




Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394